
పాదార్చన



జిల్లెళ్ళమూడి అమ్మ శ్రీచరణాలు

బులుసు లక్ష్మీప్రసన్న సత్యనారాయణ శాస్త్రి



మోక్ష సామ్రాజ్యవైభవం జిల్లెళ్ళమూడి అమ్మ

పదార్చన

బులుసు లక్ష్మీ ప్రసన్న సత్యనారాయణశాస్త్రి

అమ్మ ప్రచురణలు
శ్రీ సాయి ప్రమీల ఎన్‌క్లేవ్,
నాగమల్లితోట, కాకినాడ - 533 003

సర్వసామ్య సంకలితము
ప్రథమ ముద్రణ 2002
ప్రతులు - 2000

మూల్యం 25/- రూపాయలు

ముద్రణ :
సీతా గ్రాఫిక్స్
మెయినరోడ్, కాకినాడ - 533 001.
ఫోన్ : 2372933

విషయసూచిక

మనవి

ఇది " శాస్త్రీయ " సంగీతం.

రవీంద్రుని పాటలను 'రవీంద్ర సంగీతం' అని అంటున్నట్లే నా పేరులో "శాస్త్రి" ఉంది గనుక "శాస్త్రీయ" సంగీతం.

నేను అప్పుడప్పుడు వ్రాసుకుని, నాకు తోచినట్లుగా (శాస్త్రీయ సంగీతం రాదు గనుక) పాడుకున్న రచనల సంపుటి.

ఈ రచనలు వెలువరించడానికి ఒక కథ ఉంది. మనవి చేస్తున్నా.

త్యాగయ్యగారు " పరమాత్ముడు వెలిగేముచ్చట " అనే కీర్తనలో సమస్త భూతభావ సమన్వయ మొనర్చి ఆ పరతత్త్వాన్ని కీర్తించారు.

వాగధీశ్వరి రాగం

పరమాత్ముడు వెలిగే ముచ్చట
బాగా తెలుసుకోరే!!
హరియట హరుడట,
సురలట నరులట,
అఖిలాండకోటులట
అందరిలో, "పరమాత్ముడు"
గగనానిల తేజోజలభూమయమగు
మృగ నగ ఖగ తరు కోటులలో,
సగుణములలో విగుణములలో
సతతము త్యాగ రాజార్చితుడిలలో॥
పరమాత్ముడు వెలిగేముచ్చట
బాగా తెలుసుకోరే ॥

ఈ కీర్తనకు గొప్ప విశేషముంది. త్యాగరాజ స్వామివారు సిద్ధిపొందిన పుష్య బహుళ పంచమి రోజు ఉదయం వారు సిద్ధి పొందడానికి రెండు గంటల ముందు రెండు కీర్తనలు సెలవిచ్చారుట. ఆ రెండు కృతులు వాగధీశ్వరి రాగంలో "పరమాత్ముడు", మనోహరి రాగంలో "పరితాపము" అనే కీర్తనలు. ఈ రెండు కీర్తనలు త్యాగరాజ స్వామి వారి ఆఖరు కీర్తనలు అని చెబుతారు.

త్యాగరాజస్వామి వారి అన్ని కీర్తనలు రసగుళికలే. కాని, నా దృష్టిలో త్యాగరాజస్వామి వారి అన్ని కీర్తనలలోను ''పరమాత్ముడు వెలిగే ముచ్చట'' మకుటాయమానమైనది. అంతా అయినది, అంతులేనిది అయిన ఆ పరతత్త్వాన్ని ఎంతో మనోహరంగా కీర్తించారు. ఈ కీర్తన త్యాగరాజస్వామి వారి జీవన్ముక్త స్థితిని తెలియజేసే కీర్తనే గాక ఆ పరతత్త్వాన్ని అనుభవపూర్వకంగా ఎలుగెత్తి చాటిన కీర్తన. అలాగే రామదాసులవారి "అంతా రామమయం" అనే కీర్తన కూడా.

నా మనస్సు విభావ, అనుభావ, వ్యభిచారి భావాలతో ఆలవాలమైన సమయాలలో పోతనగారి పద్యాలు, త్యాగయ్యగారి కీర్తనలు రసస్థితిని చేకూరుస్తాయి.

నా స్థితి నాకు కొంత అవగతం. ఏమీ తెలియదు. తెలుసుకోవాలనే గుంజాటన. ఆశో, దురాశో కాని అప్పుడప్పుడు పోతన గారిలా పద్యం, త్యాగయ్య గారిలా కీర్తన వ్రాస్తే జన్మ చరితార్థమవుతుందని భావిస్తూంటాను. చదువు ఆంగ్లభాషలో జరగడం వలన తెలుగు భాషమీద అధికారం లేదు. సంస్కృత భాషా జ్ఞానం పూజ్యం. సంగీతంలో సా,పా,సా లు అనలేదు.

కొంతకాలం క్రితం ఒక కీర్తన వ్రాయడానికి ఆరంభించాను. అది ఇలా సాగింది.

ఇంత తెలిసి నేనెంతో మురిసితిని
ఎంతో అయిన శ్రీ అనంతస్వామి
నా తెలివి తప్పరాదా!
నా తెలివి తప్పరాదా!
అంతమేమిటికి అన్నిట నిండిన
అనంత రూపకుని ఎఱుక ఏమినాకు, ॥ఇంత॥

కాలానికి గమనం లేదు. పదార్థ గమనమే కాలంగా కొలవబడుతుంది.

క్రింద ముచ్చటించబోయే సంఘటనకు సుమారు పదినెలల క్రితం కీ.శే. పానుగంటి లక్ష్మీ నరసింహం పంతులు గారి “పాదుకా పట్టాభిషేకం” నాటకాన్ని విజయవాడ ఆకాశవాణి కేంద్రం వారు ప్రసారం చేశారు. ఆ నాటకాన్ని వింటున్నంతసేపు రసానందాబ్ధిలో మునిగితేలాను. నాటకం చివరన భరతుడు సత్య, ధర్మాలకు ప్రతీకలైన శ్రీ రామపాదుకలను శిరస్సున ధరించి వశిష్టులవారితో “స్వామీ !... రామపాదుకలకు నా శిరస్సే సింహాసనం. వీటికి “పట్టాభిషేకం చెయ్యండి” అని కోరినప్పుడు నా కనుల నుండి ఆనందవృష్టి కురిసింది. ఆ క్షణంలోనే ఈ నాటకాన్ని ఇంగ్లీషు భాషలో వ్రాస్తే ఎలా ఉంటుందనే ఆలోచన కలిగింది. ఆ ఊహజనించడమేమిటి మానసాకాశంలో "Coronation of the Sandals" అన్న మాటలు వినిపించాయి.

Coronation of the Sandals, Coronation of the Sandals అని పదిసార్లు జపించుకున్నాను. పేరు స్ఫురించింది. నాటకం ఎలా వ్రాయడం. అందులో పరభాష ఆంగ్లంలో. ఆంగ్లభాష చదువుకున్నాను. అంతే కాని ఆ భాష మీద నాకు ఏ మాత్రం అధికారం లేదని తెలుసు. కాని ఆంగ్ల భాషలో నాటకం వ్రాయాలని మనస్సు ఉవ్విళ్ళూరుతోంది.

నా దగ్గర వాల్మీకి రామాయణం (వావిళ్ళ వారిప్రతి) తెలుగు అనువాదంతో గల గ్రంథం ఉంది. అయోధ్య కాండ, బాలకాండ అధ్యయనం చెయ్యడం మొదలుపెట్టాను. పానుగంటి వారి “పాదుకా పట్టాభిషేకం”, భాసుని “ప్రతిమ” నాటకం ప్రతులు సంపాదించాలని ప్రయత్నం. అదృష్టవశాత్తు కామర్షి సత్యనారాయణవర్మ గారి పేరు గుర్తుకు వచ్చింది. వెంటనే వారిని కలుసుకున్నాను. వారికి నా అభిలాష తెలిపి ఆ రెండు పుస్తకాలు వారి వద్ద ఉంటే ఇమ్మనమని కోరాను. అలాగే ఇస్తానన్నారు. వారి ఇంటికి వెళ్ళి ఆ పుస్తకాలు తెచ్చుకోవాలనుకున్నాను.

చిత్రం! వారే మరునాడు ఉదయం ఆ రెండు పుస్తకాలను మా ఇంటికి తీసుకుని వచ్చి నాకు ఇచ్చారు. వారి సహృదయతకు ఎలా కృతజ్ఞతలు తెలుపుకోవాలో తెలియటం లేదు.

అయోధ్యకాండ, తులసీ రామాయణం తెలుగు అనువాదం, పానుగంటివారి "పాదుకా పట్టాభిషేకం", భాసుని "ప్రతిమ" నాటకం అధ్యయనం చెయ్యడం మొదలుపెట్టాను.

ఆ రోజు దుందుభినామ సంవత్సర మార్గశిర శుద్ధ ఏకాదశి. ముక్కోటి ఏకాదశి పర్వదినం. ఆంగ్ల కాల మాన ప్రకారం 26-12-1982. తెల్లవారుఝామున నాలుగు, ఐదు గంటల మధ్య కాలంలో మెలకువ వచ్చింది. మంచం మీద పడుకుని ఉన్నాను. "Ramayana is essentially a story of Sublime Love.... నాటక రచనకు నాందీ ప్రస్తావన వెలువడసాగింది.

మంచందిగి భావాలు భాషారూపం దాలుస్తూంటే రచన సాగించాను. దంత ధావనమైనా చేసుకోలేదు. ఆ రోజు ఉదయం 7.00 గంటలకు "ప్రోలోగ్" పూర్తి అయింది. అప్పటినుండి ఏకధాటిగా రచన సాగింది. భీష్మ ఏకాదశి (25-1-1983) నాటికి Coronation of the Sandals నాటకరచన పూర్తి అయింది. ఈ పదినెలలుగా రామభక్తి సామ్రాజ్యంలో మునిగి తేలుతూ కాలక్షేపం చేశాను.

వ్రాతప్రతిని కాకినాడలో మా ఇంటి దగ్గరలో ఉన్న చిన్న రామాలయానికి తీసుకుని వెళ్ళి నివేదించాను. ఆలయ పూజారులు శ్రీ రేజెర్ల శ్రీ రామకృష్ణమూర్తి గారు స్వామివారిని అష్టోత్తర శత నామాలతో పూజచేసి మంత్ర పుష్ప సమేతంగా నా కృషిని భరత, లక్ష్మణ, శత్రుఘ్న, హనుమత్ సమేత సీతారామస్వామి వారికి నివేదించారు.

వెంటనే సాపుప్రతి నొకదానిని వ్రాసి, శ్రీ ముక్కామల కామేశ్వరరావు గారికి సరిచూడమని ఇచ్చాను. వారు దీనిని సరిచూసి తిరిగి ఇచ్చారు.

తరువాత కామర్షి సత్యనారాయణవర్మ గారికి పానుగంటి లక్ష్మీనరసింహం గారి "పాదుకాపట్టాభిషేకం" నాటకం, భాసుని "ప్రతిమ" నాటకం పుస్తకాలు తిరిగి ఇస్తూ Coronation of the Sandals ఆయన చేతిలో పెట్టి చదివి వారి అభిప్రాయం చెప్పమని కోరాను.

రెండు రోజులయ్యాక నేను, వర్మగారు రోడ్డుమీద తారసపడ్డాం. ఆయన ఆప్యాయంగా నన్ను కౌగలించుకుని "ఎంత మంచి పని చేశావు నాయనా! అందులో పరభాషలో" అని నన్ను ఆశీర్వదించారు. ఒక సహృదయుని సమాశ్వాసం ఎంతో ఆనందాన్ని కలుగజేసింది.

1983 ఫిబ్రవరి నెల 11,12,13 తేదీలు రాష్ట్ర ప్రభుత్వోద్యోగులకు సెలవు దినాలు. ఫిబ్రవరి పదకొండో తేది శివరాత్రి పర్వదినం. ఆ మధ్యాహ్నం బయలుదేరి 12వ తేది ఉదయానికి జిల్లేళ్ళమూడి చేరాను.

అమ్మకు నా కృషిని చూపించాను. అమ్మ Coronation of the Sandals వ్రాతప్రతిని తన చేతులలోకి తీసుకుని పుస్తకాన్ని విప్పింది.

నాటకంలో మంథర స్వగతం వచ్చింది. అది చదువమంది. నాటకీయంగా మంథరను నేనే అయి చదివాను. అమ్మదాని అర్థం చెప్పమంది. "దాని అర్థం నేను నీకు చెప్పడమేమిటమ్మా. ఇందులో ప్రతి అక్షరం నీ నుండి వచ్చినదే" అని విన్నవించుకున్నాను. అమ్మ Coronation of the Sandals వ్రాతప్రతిని, నన్ను గులాబీరేకులతో అభిషేకించి ఆశీర్వదించింది. హృదయం విచ్చుకుంది. అమ్మ ఆశీర్వచనం ఈ జన్మకు నాకు చాలు.

ఆ రోజు భోజనం నేను, కొమరవోలు గోపాలరావు గారు కలసి చేసాం. భోజనానంతరం కాస్సేపు నడుంవాల్చి, సాయంత్రం మూడో అంతస్థులో అమ్మ ఆరు బయట పచార్లు చేస్తూంటే అక్కడ కొంత కాలం గడిపాను. రాత్రి భోజనం తరువాత నేను, గోపాలరావుగారు వారు వ్రాసిన కొన్ని ఆంగ్ల వ్యాసముల ప్రచురణ గురించి చర్చించాము. రామాయణంలో కైకపాత్ర గురించి అమ్మ అభిభాషణ వినిపించారు గోపాలరావుగారు. అదే భావం Coronation of the Sandals నాటకంలో ప్రతిపాదించబడింది. చాలా ఆనందమయింది.

Coronation of the Sandals వ్రాతప్రతిని అప్పుడు జిల్లెళ్ళమూడిలో ఉన్న అమెరికన్ మహిళ లిండాకు చూడమని ఇచ్చారు గోపాలరావుగారు.

ఆ రాత్రి పదకొండు గంటలకు విశాఖపట్టణం సోదరులు నిర్మించిన "శ్రీమాత" అతిధిగృహంలో విశ్రాంతి తీసుకున్నాను. మరునాడు అనగా 13-2-1983 తెల్లవారుఝామున నాలుగు గంటలకు మెలకువ వచ్చింది.

నేను అమ్మ సన్నిధిలోకి పది సంవత్సరాల క్రితం రావడం, నా రచనా వ్యాసంగం, నా సంకల్పాలు, ఆశలు, ఆశయాలు, కోరికలు, వాటిమీద అమ్మ ప్రభావం, అమ్మ గురించే కాక, నా గురించి కూడా నాకు ఏమి తెలియదనే బాధ, కించజ్ఞతా పరిధిని దాటలేకపోతున్నాననే ఆవేదన, ఇవన్నీ మానసాకాశాన్ని చుట్టుముట్టాయి. ఆ క్షణంలో నేను కొంతకాలం క్రితం వ్రాసిన కీర్తనలోని చరణాలు జ్ఞప్తికి వచ్చాయి. ఆ చరణాలు పాడటం మొదలుపెట్టాను. ఆ చరణాల కీర్తన పూర్తి అయ్యే సరికి ఆ కీర్తనకు ముగింపు స్ఫురించి ఇంకో నాలుగు చరణాలు అప్రయత్నంగా వెలువడ్డాయి. నాకు సంగీతం రాదు. యతిప్రాసల నియతి తెలియదు. కాని కీర్తన వెలువడింది.

మాయామాళవ గౌళ రాగం - రూపక తాళం

ఇంత తెలిసి నేనెంతో మురిసితిని
ఎంతో అయిన శ్రీ అనంతస్వామి
నా తెలివి తప్పరాదా
నా తెలివి తప్పరాదా ॥ఇంత॥
అంతమేమిటికి అన్నిట నిండిన
అనంత రూపకుని ఎఱుక ఏమినాకు ॥ఇంత॥
చింతలతో పది పుంతలబడితిని
వింత యనుచు ఇది ఎల్ల గ్రహించితి

అంతమందు నిజమైనది ఒకటే
తెంపులేని త్యాగరాజుని దైవమే, ॥ఇంత॥

ఆధ్యాత్మపరంగా దశరథుడు అంటే "మనస్సు" అని, ఆ మనస్సు పది దిక్కులను ఏకకాలంలో ఆకళింపు చేసుకో గల సామర్థ్యం కలిగిన విభుస్వరూపమని పెద్దలు చెబుతారు. రామాయణ మహాకావ్యాన్ని పదినెలలుగా పఠిస్తున్నాను. రామపట్టాభిషేకాన్ని అవ్యవధిగా నిర్ణయించడానికి వెనుక దశరథుని ఆలోచనా ధోరణి అతణ్ణి ఏకకాలంలో పది పుంతలలో పడగొట్టి చివరకు అతనికి అవసానాన్ని ప్రాప్తింపచేసింది.

దశరథుడు కైకేయిని వివాహమాడడానికి ముందు కన్యాశుల్కంగా కైకకు పుట్టిన వానికే రాజ్యం ఇస్తానని తన మామగారైన కేకయరాజు అశ్వపతికి మాట ఇస్తాడు. రామపట్టాభిషేకాన్ని నిర్ణయించేముందు కైకకు చెప్పడు, వశిష్ఠాది ఋషులకూ చెప్పడు. వశిష్ఠాది ఋషులకు చెప్తే వారు ఏమి ధర్మ మీమాంస చేస్తారోనని ఒక్కసారిగా సభలోనే తన నిర్ణయాన్ని ప్రకటిస్తాడు. తరువాత కైకకు చెప్పడానికి వెళతాడు. ముందే కైకకు చెప్తే ఏమి అడ్డుపుల్ల వేస్తుందోననే భయంతో, భరతుడు అయోధ్యలో లేని సమయం చూసి రామపట్టాభిషేకానికి నిర్ణయం తానే స్వయంగా తీసుకుంటాడు. ఇది కుయుక్తి. ప్రతిఫలంగా అంతులేని దు:ఖాన్ని అనుభవిస్తాడు.

ధర్మవ్యతిరేకమైన ఏ కార్యమైనా ఫలితం విపరీతంగా పరిణమిస్తుందని సూచించడానికే రామాయణంలో కథాగమనానికి ఈ చిత్రమైన మలుపు ఏర్పడింది. రామచంద్రుణ్ణి కన్న దశరథునంతవానికే తప్పలేదు.

దశరథుడే కాదు, మనం చేసే పనులు కూడా అలాగే ఉంటాయి. ఆశలు, దురాశలు, పేరాశలతో మన మనస్సు కూడా సతమతమవుతూ క్రుంగుపొంగులు అనుభవిస్తుంది. ఇదే భావన మెదిలి "చింతలతో పదిపుంతలబడితిని, వింతయనుచు ఇదిఎల్ల గ్రహించితి" అని వ్రాసుకున్నాను.

ఇంక "తెంపులేని త్యాగరాజుని దైవం" గురించి ఒక్క విషయం. డా॥ ధూళిపాళ అర్క సోమయాజిగారు మన దేశంలో ఒక అపురూప మేధా సంపన్నులు. గణితశాస్త్రంలో సునిశిత జ్ఞానం కలవారు. వేదం అధ్యయనం చేశారు. సంస్కృత భాషమీద గొప్ప అధికారం కలవారు. భీమవరం డి.యన్.ఆర్. కళాశాల ప్రిన్సిపాల్‌గా పనిచేసి పదవీ విరమణ చేశారు. తరువాత తిరుమలస్వామి కొలువులో కుదురుకుని ఆర్ష ధర్మ పరిరక్షణకు కృషి చేశారు. వారు కాకినాడలో ఒక సభలో మాట్లాడుతూ తనకు డా॥ ఆల్‌బర్ట్ ఐన్‌స్టీన్ సాపేక్ష సిద్ధాంతం అవగాహన చేసుకోవడానికి ఒక సంవత్సరం పట్టిందని, ఆ సందర్భంలో ఒక శ్లోకం వ్రాసుకున్నాని చెప్పి ఆ శ్లోకం సభలో చదివారు.

ఆణవీయాం గతిం పశ్యాం శ్చక్షు షైకేన పండిత:।
ఖగోళ గోళ సంఘానాం శ్చక్షుషా ఏనపశ్యతే॥

అణువుల అమరిక, కదలిక తెలిసినంత మాత్రాన పండితుడుకాదని, ఖగోళంలోని అనేకానేక

గోళాల, గోళ సంఘాలను దర్శించి వాటికి వీటికి సమన్వయ సూత్రాన్ని అవగాహన చేసుకుంటేనే ఈ విశ్వ రహస్యం అవగతమవుతుందని ఈ శ్లోకం యొక్క అర్థం.

అమ్మ ఒకసారి ఈ విశ్వాంతరాళంలోని గోళాలన్నీ గంపలో నేరేడు పళ్ళల్లా తనకు కనిపిస్తాయని, వక్రగతి గల భావాలన్నీ తన దగ్గర ఋజుగతి పొందుతాయని చెప్పారుట. ఎంత ఆశ్చర్యకరమైన విషయం. భూతముల, భావముల స్వరూప స్వభావాల దర్శనం ఆ ఒక్క పరమాత్మకే చెల్లు. అట్టి పరమాత్మ ఎవరో త్యాగరాజస్వామివారు తమ "పరమాత్ముడు" అనే కీర్తనలో ప్రస్తుతించారు. అంతులేని, అంతా అయిన అమ్మ సన్నిధే త్యాగరాజుల వారు కీర్తించిన పరబ్రహ్మతత్త్వం. అదే తెంపులేని త్యాగరాజు దైవం.

అట్టి పరమాత్మ తేజాన్ని రెండు కళ్ళతో అమ్మగా దర్శించుకునే భాగ్యం కలిగినందుకు, అమ్మను అవీ, ఇవీ కావాలనీ వేధిస్తూ, అమ్మ ఒడిలో ఆడుకోగలిగినందుకు మురుస్తూ వ్రాసుకుని, తత్త్వస్వరూపాన్ని తెలియపరచమని ప్రార్థిస్తూ వేడుకున్నాను.

తెల్లవారుతోంది. అమ్మ సుప్రభాత సేవలో పాల్గొని, కాలకృత్యాలు తీర్చుకుని, అమ్మను దర్శించడానికి ముందు అమెరికన్ మహిళ లిండా కనిపిస్తే ఆమెతో ఆమె గదిలోకి వెళ్ళాను.

"Sastri! What a drama you have given me. Whole night I was weeping reading the drama. You don't know how many times I walked in my room restless. Now, my heart has become full and clear. Thank you. If you allow me, I shall do the required vetting". అంది. చాలా ఆనందమయింది. వ్రాతప్రతిని ఆమె దగ్గర అట్టే పెట్టాను. (తరువాత ఆమె తన సూచనలతో వ్రాతప్రతిని తిరిగి నాకు పంపింది. ఆంగ్ల నాటకాన్ని భారతీయ విద్యాభవన్, బొంబాయి వారు ప్రచురించారు.)

లిండా దగ్గర సెలవు తీసుకుని, అమ్మను దర్శించుకుని రాత్రి నాకు స్ఫురించిన కీర్తనను అమ్మ సన్నిధిలో పాడాలని తలపు కలిగింది. కాని నాకు సంగీత జ్ఞానం లేదు.

ఉదయం పదకొండు గంటలవుతుంది. రాధన్నయ్య (కాసు రాధాకృష్ణ రెడ్డి) అమ్మ దర్శనానికి మెట్లెక్కుతూ కనిపించాడు. రాధన్నయ్య పుట్టు గ్రుడ్డి. విజయనగరం సంగీత కళాశాలలో సంగీతం నేర్చుకున్నాడు. గొప్ప సంగీత పాఠకుడు. సంగీత మర్మాలను సహజంగానే ఆకళింపు చేసుకున్నాడు. అమ్మ నామాన్ని వివిధ రాగాల్లో పాడగల ప్రజ్ఞావంతుడు.

రాధన్నయ్యను మెట్లమీద కలుసుకుని, "రాధన్నయ్యా! నేను త్యాగరాజ కీర్తన వ్రాసాను. నీవు అమ్మ సన్నిధిలో పాడాలి" అని అడిగాను.

ఆ మెట్లమీదనే "ఇంత తెలిసి నేనెంతో మురిసితిని" అనే కీర్తనలోని ప్రథమచరణాన్ని వినిపించాను.

"బాగుంది. పూర్తిగా పాడు" అన్నాడు రాధన్నయ్య.

మేము నడుస్తూ అమ్మ గది చేరుకున్నాము. అమ్మ గదిలో తమిళదేశం నుండి వచ్చిన యాత్రీకులున్నారు. అమ్మ మంచం దగ్గర కూర్చున్నాము. కీర్తన పూర్తిగా రాధన్నయ్యకు

చెప్పలేకపోయాను.

అమ్మ మా ఇద్దరి వైపు చూసింది.

రాధన్నయ్య నా తొడమీద తాళం వేస్తున్నాడు. "పాడు" అని బలవంతం చేస్తున్నాడు. నాకు కంగారుగా ఉంది. పాడటం చేత కాదు. "రాధన్నయ్య నాకు సంగీతం రాదు నీవు పాడు" అన్నాను.

"ఛస్! అదేమిపనికిరాదు. నాకు ఓ సగం చెప్పావు. పూర్తిగా చెప్పేవరకూ ఊరుకోను". అంటూ నా వీపు మీద తాళం వెయ్యసాగాడు.

"పాడు నాన్నా! వాడు ఊరుకోడు" అన్నట్లు అమ్మ నా కేసి చూసింది.

అంతే నా గళాన్ని బ్రద్దలు చేసుకుని కీర్తన వైఖరీ రూపు దాల్చింది. రాధన్నయ్య నాతో కలసి పాడసాగాడు. నా వీపు మీద తాళం వేస్తూనే ఉన్నాడు. ఇద్దరి గొంతుల స్థాయి ఒక్కలాగే ఉంది. ఆ క్షణంలో రాధన్నయ్య ఏకసంథాగ్రాహి అని గ్రహించాను.

నాకు సాధారణంగా కనులలో నీరు నిండదు. కీర్తనలో " శ్రీ అనంతస్వామి " అని పాడుతున్న తరుణంలో శ్రీ అనంతస్వామి సన్నిధిలో ఉన్నట్లు భావించాను. కన్నులు చెమ్మగిల్లాయి. హృదయం ఆర్ద్రమయింది. కీర్తన పాడటం పూర్తి అయ్యాక అమ్మ కాఫీ తెప్పించి మా ఇద్దరికే కాక అక్కడ ఉన్నవారందరికి ఇప్పించింది.

అమ్మ సన్నిధిలో నా కీర్తన ఆవిష్కరణ అలా జరిగింది. తిరిగి వస్తోంటే "ఏమి నెప్పి పెట్టలేదు కదా! వాడు ఊరికే వీపు మీద బాదేశాడు" అంది అమ్మ.

"లేదమ్మా! రాధన్నయ్యకు నా వీపు మృదంగమయింది" అని చెప్పాను.

సంగీతం వచ్చినా, రాకపోయినా నా మొదటి పాటకచేరి నా కీర్తనతోనే అమ్మ సన్నిధిలో చేసే సౌభాగ్యం కలిగింది. రాధన్నయ్య గురువయ్యాడు.

ఆ రోజు కాకినాడ రావడానికి అమ్మ దగ్గర సెలవు తీసుకుంటూ "అమ్మా! సంగీతం నేర్చుకుంటానమ్మా! అని నివేదించాను. రాధన్నయ్య అప్పుడు అక్కడే ఉన్నాడు.

వ్యాన్ ఎక్కే ముందు రాధన్నయ్య కనిపించాడు. రాధన్నయ్య సెలవు తీసుకుంటూంటే "నేను నీ వీపు మీద ఎందుకు కొట్టానో తెలుసునా" అన్నాడు. "చెప్పు" అన్నాను.

నీ కలంలోంచి వచ్చిన కీర్తన నీ గళంలోంచి అమ్మ సన్నిధిలో నివేదింపబడాలి. అప్పుడు దానికి, నీకు చరితార్థత. సంగీతం నేర్చుకోవడమేమిటి? మనకి ఒకళ్ళు చెప్పడమేమిటి? జీవితమే సంగీతం. హాయిగా పాడుకో" అన్నాడు. ఒక పుట్టుగ్రుడ్డి నుండి ఎంత ఉదాత్త భావన వెలువడింది.

ది. 14-2-1983 తేది ఉదయం కాకినాడ చేరుకున్నాను. క్రిందటిరోజు అమ్మ సన్నిధిలో జరిగిన విశేషం గురించి ఆలోచనలు సాగుతూనే ఉన్నాయి. ఇంటికి వచ్చాక ఒక్క క్షణంలో సంగీత శాస్త్ర స్వరూపం భాసించింది.

సన్-గీతమే సంగీతము. ఈ విశ్వమే ఒక అనంత నాదం. అందు సదాశివుడు.

ఆత్మ మధ్య గతో ప్రాణ:
ప్రాణ మధ్య గతా ధ్వని:।
ధ్వని మధ్యగతో నాద:
నాదమధ్యే సదాశివ:॥

(స్వరార్ణవం)

అమ్మ దర్శనానికి జిల్లెళ్ళమూడి వెళ్ళినప్పుడల్లా నేను ఎక్కువగా రాధన్నయ్య తోను, యార్లగడ్డ రాఘవయ్య గారితోను, కొమరవోలు గోపాలరావుగారి తోను, శ్రీ పన్నాల రాధాకృష్ణ శర్మ గారితోను, శ్రీ విఠాల రామచంద్రమూర్తి గారితోనూ కాలక్షేపం చేసేవాడిని. అమ్మ పెట్టిన ఈ అనుబంధాలతో రాధన్నయ్య మధ్య, నా మధ్య ఆప్యాయత, ఆత్మీయత పెరిగాయి.

ఒకసారి అన్నయ్య కాకినాడ వస్తే అతనికి మా ఇంట్లో ఆతిధ్యమిచ్చాం. గాత్రం కోటేశ్వరరావు గారి ఇంటి దగ్గర నుండి రిక్షాలో రాధన్నయ్యను మా ఇంటికి తీసుకుని వెళ్ళాను. మా ఇంటి మెట్లు ఎక్కుతూ ఆగిపోయాడు. మెట్ల మీద నిలబడిపోయాడు. ఎందుకు ఆగిపోయాడో తెలియదు.

"ఏం అన్నయ్యా ఆగిపోయావు. రా! ఇంట్లోకిరా!" అన్నాను.

"మీ ఇంట్లోంచి వేదం వినిపిస్తోంది. ఒక బాల్చీతో నీళ్ళు పట్టుకురా. కాళ్ళు కడుక్కుని వస్తాను" అన్నాడు.

"నేను వేదం అధ్యయనం చెయ్యలేదు. కాని ఉపనిషత్తులు, అప్పుడప్పుడు గీత పారాయణ చేస్తాను. అంతే" అన్నాను.

"నువ్వు వేదం చదువుకోకపోవచ్చు. మీ పూర్వీకులు చదువుకుని ఉండవచ్చు కదా" అన్నాడు.

"అవును, మాది వేద పండితుల వంశం. మా తాతలు, ముత్తాతలు, మా నాన్నగారి మాతామహులు గొర్తి సోమనాథ శాస్త్రిగారు గొప్ప వేదపండితులు" అన్నాను.

మా పిల్లలు తెచ్చిన నీళ్ళతో కాళ్ళు కడుక్కుని, ఇంట్లోకి వస్తూ " అందుకే మీ ఇంట్లోంచి వేదం వినిపిస్తోంది. ఎవరి ఇంట్లోనైనా ఎక్కువగా వేదపారాయణ, లలిత పారాయణ, విష్ణు సహస్రనామ పారాయణ జరుగుతూంటే, ఆ ఇంట్లో సీలింగ్ ఫ్యాన్ తిరుగుతున్నప్పుడు ఆ మంత్రాలు, నామాలు సూక్ష్మంగా చెవులకు సోకుతాయి. ఇదో రహస్యం, సంగీతం పాడేవాళ్ళ ఇళ్ళలోనూ అంతే. సీలింగ్ ఫ్యాన్ తిరుగుతూంటే సూక్ష్మంగా సంగీతం వినిపిస్తుంది. ఎప్పుడైనా గమనించావా" అన్నాడు రాధన్నయ్య.

"అవునన్నయ్యా గమనించాను. ఏ శబ్దాలు వినిపించని రాత్రిళ్ళప్పుడు సీలింగ్ ఫ్యాన్ వేసుకుంటే వేదమంత్రాలు, నామాలు ఎక్కువగా వినిపిస్తాయి. అంతే వాటి మీద శ్రద్ధ పెట్టలేదు." అన్నాను.

మేం మాట్లాడుకుంటూంటే మా పిల్లలు రాధన్నయ్య చుట్టూ చేరి పలకరింపులు, కుశల ప్రశ్నలు వేయసాగారు.

"అన్నయ్యా ! ఏదైనా మంచి కీర్తన పాడు అన్నయ్యా". అంది మా అమ్మాయి లక్ష్మి.

"అప్పనా తనామనా
మారోరి భైరన్న
మారోరి భైరన్న
మంచోడు భైరన్న
మటికోడు భైరన్న"

అంటూ అనేక శబ్దాలు చేసి మా పిల్లల్ని అలరించాడు. మంచి హుషారుగా ఉన్నాడు. నాకు, రాధన్నయ్యకు మా ఆవిడ కాఫీ తెచ్చి ఇచ్చింది. రాధన్నయ్య కాఫీ త్రాగుతూంటే "అన్నయ్యా ! నువ్వు జిల్లేళ్ళమూడి ఎలా వచ్చావు. అమ్మతో పరిచయం ఎలా అయింది" అని అడిగాను.

"చెప్పమంటావా" అన్నాడు రాధన్నయ్య.

"చెప్పు అన్నయ్యా" అని నేను, పిల్లలూ కలసి అడిగాము.

"చెబితే నా గురించి ఏమి అనుకోరు కదా" అన్నాడు.

"ఏమి అనుకోము చెప్పు" అన్నాను.

" నేను, తమ్ముడు వెంకటేశ్వర రెడ్డి కలసి పుట్టపర్తి వెళ్ళాం. బాబాల్ని, అమ్మలను ఒక పట్టు పట్టాలనే ఉద్దేశంతోనే వెళ్ళాం. సాయిబాబా వారిని విసిగించి, వేధించసాగాం. మా చేత గుద్దులు, దెబ్బలు కూడా తిన్నాడు ఆయన. పుట్టపర్తిలో ఉండగానే జిల్లేళ్ళమూడి అమ్మ గురించి తెలిసింది. నేను, మా తమ్ముడు కూడబలుక్కుని జిలేళ్ళమూడి అమ్మను కూడా ఒక పట్టు పట్టాలని జిల్లేళ్ళమూడి చేరుకున్నాం. ఇద్దరం పుట్టుగుడ్డి వాళ్ళం. చాలా మొండిగా బ్రతికాం. విజయనగరం సంగీత కళాశాలలో సంగీతం నేర్చుకున్నాం. ఎవ్వళ్ళని లెక్క చేసేవాళ్ళం కాదు. ఈ అమ్మా , బొమ్మా ఎవరో తేల్చుకోవాలని నిర్ణయించుకున్నాం. జిల్లేళ్ళమూడి వచ్చాం. అమ్మ దగ్గరకు మమ్మల్ని ఎవరో తీసుకుని వెళ్ళారు. అమ్మ మంచం దగ్గర కూర్చున్నాం. మాటామంతీ ఏమి లేదు. అమ్మ పాదాలు ఎంత సుకుమారంగా ఉంటాయో నీకు తెలుసుకదా!" అడిగాడు రాధన్నయ్య.

"అవును. కవులు తమ కావ్యాలలో నాయికల పాదాలు లేత తమలపాకుల్లా ఉంటాయని వర్ణించినట్లు అమ్మ పాదాలు అంత మృదువుగానూ ఉంటాయి" అన్నాను.

"అంత మృదువుగా ఉండే పాదాలను మీ లాంటి వాళ్ళే విరవాలని ప్రయత్నిస్తే మడమల క్రింద ఇట్టే విరిగిపోతాయి. అవునా ! మళ్ళీ అడిగాడు రాధన్నయ్య.

"అవును" అన్నాను. ఆశ్చర్యపోతూ. రాధన్నయ్యది చాలా బలిష్టమైన శరీరం. సుమారు ఆరడుగుల ఎత్తు ఉంటాడు. నల్లగా కరుదూపం లాంటి మేనిఛాయ. భారీ కాయం. అరచేతులు ఆకురాళ్ళల్లా ఉంటాయి. చీకట్లో చిన్న పిల్లలే కాదు పెద్ద వాళ్ళు చూసినా భయపడతారు. కాని ఎంతో మంచివాడు.

వంటింట్లో మా ఆవిడ తోటకూర పులుసులో ఆవ కలుపుతోంది. ఆవ సువాసన వచ్చింది.

"ఏమిటి వండిస్తున్నావు శాస్త్రీ" అడిగాడు రాధన్నయ్య.

బీరకాయ పప్పు, తోటకూర పులుసు, పులిహోర, సేమ్యా పరమాన్నం, పెరుగు, పచ్చడి ఏదీ చేయించలేదు. ఆవకాయ ఉంది" అన్నాను.

"అవి అన్నీ నాకు ఇష్టమే". విందు ముందు. భోజనం అయ్యాక మిగతా కథ చెబుతాను" అన్నాడు రాధన్నయ్య.

"ఇప్పుడే చెప్పాలి, ఇప్పుడే చెప్పాలి" అని పిల్లలు గోల చేశారు.

"బొజ్జ నిండితే గాని చెప్పనంటే చెప్పనుగా అని రాధన్నయ్య పిల్లలతో కలసి అల్లరి చేశాడు.

మా ఆవిడ వచ్చి "వంట అయింది, భోజనాలకు లేవండి" అంది.

"భలే భలే బలుసుకూర, ధుమాధుమా దుంపలకూర" అంటూ రాధన్నయ్య లేచి నిలబడ్డాడు. "మీ ఇంటి పేరు బులుసువారు. బులుసు లేని యజ్ఞం, బలుసు లేని తద్దినం పనికి రావంటారు". అన్నాడు రాధన్నయ్య.

"అవును" అన్నాను.

మేము పెరట్లోకి వెళ్ళి కాళ్ళు కడుక్కుని వచ్చేసరికి పిల్లలు నాకూ, రాధన్నయ్యకు విస్తర్లు వేసారు. రాధన్నయ్యను విస్తర దగ్గర కూర్చోపెట్టి నేను ఇంకో విస్తరి దగ్గర కూర్చున్నాను. మా ఆవిడ వడ్డన మొదలు పెట్టింది. మా అమ్మాయిని రాధన్నయ్య విస్తర్లో అన్నం కలపమన్నాను.

"నాలుగు ఆవకాయ పెచ్చులు వెయ్యమ్మా" అన్నాడు రాధన్నయ్య.

"అలాగే" అని మా ఆవిడ సగం కాయావకాయ వేసింది.

మా అమ్మాయి బీరకాయపప్పు, అన్నం కలుపుతూంటే "ఎండు మిరపకాయులు, పచ్చిమిరపకాయ ముక్కలు ఏరి ప్రక్కన పెట్టు. అన్నయ్యకు కారం పెడతాయి" అన్నాను.

వద్దు అని "పచ్చి మిరపకాయ ముక్కలు అలానే ఉండనియ్యి. గుంటూరు జిల్లావాళ్ళంకదా అన్నీ కలిపి పెట్టు లోపలికి పోతాయి" అంటూ నవ్వాడు రాధన్నయ్య.

మా అమ్మాయి రాధన్నయ్య విస్తర్లో బీరకాయ పప్పు అన్నం కలిపి గుంట చేస్తే మా ఆవిడ మధ్యలో వేడి వేడి తోటకూర పులుసు వేసింది. అప్పుడుమా అమ్మాయి రాధన్నయ్య విస్తర్లో పప్పు అన్నం, పులుసు, ఆవకాయ, పులిహోర, ఎక్కడున్నాయో చేతికి చూపించింది. సేమ్యా పాయసం గిన్నెలో పోసి ప్రక్కన పెట్టింది మా ఆవిడ.

నేను పరిషేచనం పట్టి ప్రాణాహుతులు ఇస్తూంటే, "భోజన ప్రారంభసమయే అమ్మ నామ స్మరణ జయహోమాతా" అని రాధన్నయ్య ఒక్క ముద్ద పప్పు అన్నం తోటకూర పులుసులో ముంచుకుని నోట్లో పెట్టుకున్నాడు. ఆ రోజున తోటకూర పులుసు చాలా రుచిగా ఉంది.

"అమ్మా ! తోటకూర పులుసు గిన్నె ఇలా పట్టుకువచ్చి నా విస్తరి దగ్గర పెట్టు. మీరు చారు కాచుకోండి" అన్నాడు రాధన్నయ్య. మా ఆవిడ తోటకూర పులుసు గిన్నె తెచ్చి మా ఇద్దరి విస్తర్ల మధ్యన పెట్టింది. ఆ రోజున మొదటి నుండి చివరిదాకా రాధన్నయ్య పప్పులో పులుసు, పులిహోరలో పులుసు, ఆవకాయ అన్నం పులుసుతోనే తిన్నాడు.

"ఇంకా సేమ్యా, పెరుగు ఉన్నాయి" అని నేను అంటే, అవి త్రాగుతాను. ఇవ్వాళ తోటకూర పులుసు పని పట్టాల్సిందే. పెరుగు గిన్నెలో పోసి ఇవ్వండి త్రాగుతాను. అంతే. భోజనం అంతా తోటకూర పులుసుతో సాగాలి" అన్నాడు రాధన్నయ్య.

ఆ రోజున రాధన్నయ్య తోటకూర పులుసును లేవిడీ కొట్టించాడు. మాకు చాలా ఆనందమయింది.

భోజనాలు అయ్యాక "శాస్త్రీ ! ఒక చాపపరు. ఈ భుక్తాయాసం సాయంత్రం దాకా దొర్లితేగాని పోదు" అన్నాడు. రాధన్నయ్యకు చాప పరచి, ప్రక్క వేసి పడుకో పెట్టాం. సాయంత్రం వరకూ గుర్రు పెట్టి నిద్రపోయాడు.

రాధన్నయ్య లేచాక మా ఆవిడ మాకు కాఫీ కలిపి ఇచ్చింది.

" శాస్త్రీ ! ఇప్పుడు నా కార్యక్రమం ఏమిటో తెలుసా" అన్నాడు.

"చెప్పు" అన్నాను.

"రాష్ట్రపతి పదవికి పోటీ చెయ్యబోతున్నాను."

"తప్పకుండా చెయ్యి. ఐదువేల సంవత్సరాల క్రితం ఒక పుట్టుగుడ్డి రాజ్యమేలితే మహా భారత యుద్ధం జరిగింది. నువ్వు రాష్ట్రపతివైతే మూడో ప్రపంచ యుద్ధం వస్తుంది. అంతే కదా " అన్నాను.

హాయిగా నవ్వుతూ "అంతేనంటావా" అన్నాడు రాధన్నయ్య.

"వాడిది ఉడుంపట్టు. నీదీ ఉడుంపట్టే. ఇద్దరూ ఒక్క లాంటి వాళ్ళే. మూడో ప్రపంచ యుద్ధం రాకేం చేస్తుంది" అన్నాను.

"ఉడుంపట్టు,ఉడుంపట్టు,ఉడుంపట్టు" అని చాలాసార్లు అంటూ "శాస్త్రీ ! పిల్లల్నిపిలు. అమ్మ దగ్గరకు ఎలా వచ్చానో చెబుతాను" అన్నాడు రాధన్నయ్య.

పిల్లల్ని పిలిస్తే అందరూ రాధన్నయ్య చుట్టూ చేరారు.

"ఎంత వరకు చెప్పాను" అన్నాడు రాధన్నయ్య.

"మీరూ, మీ తమ్ముడు జిల్లెళ్ళమూడి వచ్చి అమ్మ మంచం దగ్గర కూర్చున్నారు" అన్నాడు మా నాలుగో అబ్బాయి.

"అమ్మ మంచం దగ్గరకు జరిగి, అమ్మ పాదాలు స్పృశించాలనే నెపంతో అమ్మకుడిపాదం పట్టుకుని ఆ పాదం విరిచెయ్యాలని అటూ, ఇటూ త్రిప్పటం మొదలు పెట్టాను. ఎవరో "ఏయి అదేమిటి" అని అంటే, అమ్మ వారిని వారించింది. అంతే ఒక అరగంట సేపు నా రెండు చేతులతోనూ అమ్మ పాదం పట్టుకుని విరిచెయ్యాలని తీవ్రయత్నం చేశాను. ఎంత ప్రయత్నించినా పాదం విరగలేదు. ఒక అరగంట కుస్తీ పట్టిన తరువాత నాలో శక్తి క్షీణించ సాగింది. ఆయాసం వచ్చింది. అప్పుడు అమ్మ నెమ్మదిగా "ఇంకా ఉందా ! అయిపోయిందా" అని అంది. అంతే నేను ఏడుపు ఆపుకోలేక అమ్మ పాదాల మీద వాలిపోయాను. అలా అమ్మ పాదాల మీద పడి ఎంతసేపు ఏడ్చానో తెలియదు. అమ్మ నాకు మంచినీళ్ళు ఇచ్చి, అరటిపళ్ళు, కొబ్బరికాయ ముక్కలు పెట్టి



సోదరుడు కాసు రాధాకృష్ణరెడ్డి (రాధన్నయ్య)
స్మృతికి ఆప్యాయతతో పదార్చన అంకితం

అంఆ

2. అంధ విశ్వాసము

దయామణి

(బ్రహ్మాండం వసుంధర)

శ్రీ బులుసు సత్యనారాయణ శాస్త్రి గారు తాము రచించిన అమ్మ "పదార్చన" పుస్తకం ఇచ్చి "ఇది రాధాకృష్ణరెడ్డికి అంకితం చేయాలనుకుంటున్నాను" అని చెప్పి, రాధన్నయ్య తో గల తన్న అనుభవాన్ని చెప్పి "వాణ్ణి గురించి నువ్వేమైనా వ్రాయమ్మా, వాడి రాక కూడా తెలిసిన దానివి కదా" అన్నారు. నాకేమి చేత కాదు అన్నయ్యా ! నేను ఏమి వ్రాయలేను" అని అన్నాను. "అదే వ్రాసివ్వు" అన్నారు శాస్త్రి గారు.

అమ్మ చెప్పింది వ్రాయాల్సిందేగాని, నేను ఏమి వ్రాయగలను. అంతులేని, అడ్డులేని, ఆద్యంతములు అయిన అమ్మ సన్నిధే త్యాగరాజుల వారు కీర్తించిన శ్రీ పరబ్రహ్మత్త్వంగా శాస్త్రిగారు అనుభవం పొందారు.

అమ్మ 1985 జూన్ 2వ తేదిన "ఎందరో మహానుభావులు కాదురా, అందరూ మహానుభావులే. అందరికి వందనములు" అని చేతులు జోడించి నమస్కరించింది.

అది వివరంగా శ్రీ శాస్త్రిగారు తమ పాటలో అభివర్ణించారు.

పూలతో పూజించవచ్చు,
బ్రహ్మజెముడు గుచ్చవచ్చు,
దోపిడీకి దిగవచ్చు,
అయిన నేమి అందరూ బిడ్డలే;

అందరూ మహానుభావులే
అందమైన ఈ నిలయమున;

కోపగించి కొట్టవచ్చు,
తాపము ప్రకటింపవచ్చు,
కాలువిరచి చూడవచ్చు,
అయిన నేమి అందరూ బిడ్డలే;

అందరూ మహానుభావులే
అందమైన ఈ నిలయమున;

ఏమియైన నేమి కాని,
పొట్ట తడిమి పెట్టునమ్మ,
పిల్లలుకాదా మరి
తెలిసీ తెలియని సన్నాసులు

అందరూ మహానుభావులే

అందమైన ఈ నిలయమున

అంటూ అమ్మ యొక్క మాతృత్వాన్ని తెలియజేశారు.

అంధ సోదరులైన రాధాకృష్ణరెడ్డి, వేంకటేశ్వరరెడ్డి ఇద్దరూ కలసి పుట్టపర్తిలో ఉన్న భగవాన్ సత్యసాయిబాబా గారి దగ్గరుకు వెళ్ళారుట. బాబాలను,అమ్మలను ఒక పట్టు పట్టాలనే ఉద్దేశ్యంతోనే బాబాగారిని విసిగించి, వేధించేవారుట. పుట్టపర్తిలో ఉండగానే అమ్మను గురించి విన్నవారై, జిల్లేళ్ళమూడి వచ్చి, ఒక పట్టు పట్టాలని అన్నదమ్ములిద్దరూ ఆలోచించుకుని, జిలేళ్ళమూడి వచ్చారు. (వాళ్ళిద్దరూ విజయనగరం సంగీత కళాశాలలో సంగీతాన్ని అభ్యసించారు.)

అమ్మ హాల్లో మంచం మీద కూర్చుని ఉంది. (ఇప్పుడు అలంకార హైమ ఉన్న ఇల్లు). వారి రాకను చూచిన ఒక సోదరుడు వారిద్దరిని అమ్మ వద్దకు తీసుకుని వచ్చాడు. వారిద్దరూ అమ్మ మంచం దగ్గర కూర్చున్నారు. అమ్మ పాదాలను స్పృశించాలనే నెపంతో మంచానికి బాగా దగ్గరగా జరిగి రాధాకృష్ణరెడ్డి అమ్మ కుడిపాదం పట్టుకుని అటూ, ఇటూ త్రిప్పటం మొదలుపెట్టాడు. (విరిచెయ్యాలని అభిప్రాయంట, తరువాత తెలిసింది) అతిసున్నితమైన గులాబీరేకుల వంటి అమ్మ పాదాలను అలా మెలికలు త్రిప్పుతూంటే అమ్మ మంచం ప్రక్కన కూర్చున్న సోదరుడు "ఏయ్ అదేమిటి" అని అంటుండగా సహనమూర్తి అయిన అమ్మ ఆ సోదరుని వారించింది. అక్కడున్న వారందరికి బాధ కలిగింది. కోపం వచ్చింది. కానీ ఎవ్వరం ఏమి చెయ్యలేము కదా! ఒక అరగంట అమ్మను హింసించాడు. క్రమంగా అతనిలో శక్తి క్షీణించింది. అమ్మను ఏమి చెయ్యలేకపోయాడు. ఆయాసపడుతున్నాడు. అమ్మ లాలనగా, అతి మృదువుగా "ఇంకా ఉన్నదా, అయిపోయిందా" అన్నది.

అతను వెంటనే అమ్మ పాదాలమీద వాలిపోయాడు.

'దుష్ట శిక్షణ అంటే వ్యక్తి ని కాదు సంహరించాల్సింది, వ్యక్తిలోని దుష్టత్వాన్ని సంహరించాలి' అని అమ్మ అన్నట్లు అతను అమ్మకు శరణాగతుడైనాడు.

అమ్మ అతనిని ప్రేమగా దగ్గరకు తీసుకుంది. అతనికి దు:ఖం వచ్చింది. అమ్మ ప్రేమకు కరగిపోయాడు. ఎంతోసేపు ఏడ్చాడు. అమ్మ అతనికి ముందు మంచినీళ్ళు ఇచ్చి, అరటిపండ్లు, కొబ్బరికాయ ముక్కలు తినిపించింది.

"నువ్విక్కడే ఉండు నాన్నా ! ఎక్కడికీ వెళ్ళకు" అన్నది అమ్మ.

ఆనాటి నుండి రాధన్నయ్య జిల్లేళ్ళమూడి వాస్తవ్యుడైనాడు.

అంధుడైన అతను అంధ విశ్వాసం కలవాడైనాడు. అతనికి ఎప్పుడు ఏది కావాలో అతనిని అడిగి తెలుసుకుని, అతని కోరిక ప్రకారం అట్లని, బొబ్బట్లని, అరిశెలని, అసాధ్యమైన కోరికలు కోరినా అమ్మ వెంటనే చేయించిపెట్టేది.

దీక్ష వహించి అనసూయేశ్వరాలయంలో నిరాహారుడై, అహర్నిశలు నామం చేసేవాడు.

ఆహారం లేకుండా నామం చేస్తూంటే, అమ్మ సహించలేక అతనికి అవసరమైన ఆహారాన్ని నన్ను ఇచ్చిరమ్మనేది. ముందు కొంత చిరాకుపడినా, తను ఎంత హింసించినా సహించిన -

అమ్మ మనసు బిడ్డ ఆహారం తీసుకోకపోతే సహించలేని – ఆ అమ్మ పంపిన ప్రసాదాన్ని నిరాకరించ లేక స్వీకరించేవాడు.

ఎంత గొప్ప సంగీత విద్వాంసులైనా పాడుతుంటే, అర్థం కాని కీర్తనలు రాధన్నయ్య గళం విప్పి, భావయుక్తంగా, స్వరయుక్తంగా పాడుతుంటే తెలియని చిన్నారులకైనా ఇట్టే అర్థమయ్యేవి. అమ్మ నామం వివిధ రాగాలలో హృదయస్పందన కలిగేలా చేసేవాడు.

అమ్మ అంటే అచంచలమైన భక్తి, విశ్వాసాలుకల సజ్జా వారి పాలెం సోదరి వల్లభనేని సారసాక్షి కుటుంబం1969 సంవత్సరంలో అకస్మాత్తుగా కష్టాలలో చిక్కుకుని, అమ్మ సన్నిధికి వచ్చి, సత్యనారాయణ వ్రతం జరుపుకుంటామని అమ్మను అడిగారు.

ఆ సమయంలో అమ్మ దగ్గరే ఉన్న రాధన్నయ్య "అమ్మ వ్రతం చేసుకోండి" అని వాళ్ళను ఆదేశించి, "అమ్మ వ్రతం చేయించు" అని అమ్మ పూజారి అయిన రామకృష్ణ అన్నయ్యను ఆదేశించాడు. అన్నయ్య ఆ మాటను అమ్మ ఆజ్ఞగా భావించి, అనసూయా వ్రతానికి రూపుదిద్ది, వ్రతం చేయించాడు. ఆ కుటుంబం భక్తి శ్రద్ధలతో అనసూయా వ్రతం చేసుకున్నారు. వారి గండం గడిచి వారి కష్టాలు గట్టెక్కాయి. అప్పట్నుంచీ అనేక మంది అనసూయా వ్రతాలు చేసుకుని, అనేక శుభాలను పొంది ఆపదల నుండి రక్షణ పొందుతున్నారు.

రాధన్నయ్య అందరి అభిమానాన్ని చూరగొన్నాడు. కొందరు గురువుగా కూడా భావించే వాళ్ళున్నారు. అందులో శ్రీ శాస్త్రిగారొకరు. శాస్త్రి గారు, రాధన్నయ్య కలసి మేడపైనున్న అమ్మ దర్శనానికి వెళ్తుండగా ఆయన వ్రాసిన కీర్తనల గురించి చెప్పారుట.

అమ్మ దర్శనం చేసుకుని కూర్చున్న తరువాత శాస్త్రి గారిని పాడమని శాస్త్రి గారి తొడమీద రాధన్నయ్య తాళం వేశాడు. నాకు రాదు అని ఆయన అన్నప్పటికీ, పాడకపోతే నేను ఊరుకోను అని వీపుమీద తాళం వేయసాగాడు. అదంతా గమనిస్తున్న అమ్మ "పాడు నాన్నా ! వాడు ఊరుకోడు" అన్న అమ్మ ఆజ్ఞకు బద్ధులై ఆయన గళాన్ని విప్పారు. రాధన్నయ్య తన గొంతు కలిపాడు. ఇద్దరి గొంతులు ఏకమైనాయి. శాస్త్రి గారి కీర్తనల పుస్తకం అమ్మ పాదాల చెంత ఉంచారు. ఈ పుస్తకం ఆవిష్కరణ అలా జరిగింది. అమ్మ శాస్త్రిగారికి కుంకుమ దిద్ది, తన పాదాలపై ఉన్న గులాబీ పూల రేకులతో ఆశీస్సులందించింది. ఆ సమయంలో ఉన్న అందరికీ నా చేత కాఫీ ఇప్పించింది.

అమ్మ తనెంత బాధనైనా సహిస్తుందిగాని, ఏ బిడ్డ అయినా బాధ పడితే తట్టుకోలేదు. "వీపు నెప్పి పెట్టిందా నాన్నా ?" అని ఓదార్పుగా అడిగింది.

ఆయన "లేదమ్మా" అన్నారు సంతోషంగా.

అమ్మ సన్నిధిలో పాడే గొప్ప అవకాశాన్ని కలిగించి ప్రోత్సహించిన రాధన్నయ్యకు ఈ "పదార్చన" కీర్తనల సంపుటిని అంకితం చేయాలని శ్రీ శాస్త్రిగారు అభిలషించారు.

వారిద్దరూ ధన్యులైనారు.

జయహోమాతా.

3. విచిత్ర వ్యక్తిత్వము

ఇ. హనుమబాబు

విజయనగరం మహారాజావారు తమ పుట్టినరోజు నాడు శ్రీమదజ్జాడ ఆదిభట్ల నారాయణదాసు గారిని ఆశీస్సులనిచ్చే నిమిత్తంగా ఆహ్వానిస్తే, ఆ నగరంలోనే ఉంటూ ఉన్నప్పటికిని, నిరంకుశ వైఖరితో "దాసు" గారు మీ రాజుగారు రమ్మన్నప్పుడు రావడానికి, పలకమన్నప్పుడు పలకడానికి సాధ్యం కాదు. నాకు రావాలన్నప్పుడు వస్తాను", అని ఆ సాయంకాలమే వెళ్ళి, అర్ధరాత్రి వరకూ జగన్మోహనంగా హరికథ చెప్పి, సభను అలరించి, రాజుగారికి ఆశీస్సులనందించిన విశేష వ్యక్తి దాసుగారు.

ఇంచుమించు అలాంటి నిరంకుశత్వము కలవాడే కీ.శే. కాసు రాధాకృష్ణరెడ్డిగారు. విజయనగరం మహారాజా వారి సంగీత కళాశాలలో సంగీత విద్యాభ్యాసం చేసి, సర్టిఫికేట్ తీసుకోకుండా ఉన్న విచిత్ర వ్యక్తిత్త్వము, మనస్తత్త్వము కలిగిన్వ్యక్తి ఈయన. అదేమిటి? ఎందుకిలా చేశారు? అంటే, 'మాకెందుకయ్యా. మేము రెడ్డిరాజులము. ఒకరి క్రింద ఉద్యోగాలు చేస్తామా' అన్నారు. అయితే విశ్వజనని జిల్లెళ్ళమూడి అమ్మ కొలువులో ఆ స్థాన విద్వాంసుడిగా నుండి ధన్యుడైనాడు. తనంతట తానుగా అమ్మ నామం చేయాలనుకొన్నప్పుడు, అసహాయంగా , అలుపు లేకుండా, స్థాయి తగ్గకుండా, విశ్రాంతి తీసుకోకుండా , ఈ రోజు ఉదయం మొదలు పెడితే రేపటి ఉదయం వరకూ 'నామసంకీర్తన' అనేక పర్యాయములు చేసినవాడు.

ఈయన నామసంకీర్తన చేస్తున్నప్పుడు వినేవారికి నాట్యం చేద్దామా అన్నంత ఉత్సాహం కలిగేటట్లుగా ఉండేది. తార, మధ్యమ, మంద్రస్థాయిలలో ప్రణవాన్ని సాధన చేసేవాడు ఈయన. అయితే ఇది ప్రత్యేకంగా కాకుండా అమ్మ నామసంకీర్తనలో భాగంగా కలిపి చేసేవాడు. ఒకసారి నాతో 'నువ్వు కూడా ప్రణవో పాసన చెయ్యి' అని ఆలయాల దగ్గర ఒక పాక ఉంటే అందులో కూర్చోపెట్టి ఎలా చెయ్యాలో చెప్పాడు. నేను మంద్రస్థాయిలో చేస్తున్నప్పుడు దౌడలు, నాలుక, మాడు ఈ మూడు చోట్ల జలజలలాడుతూ కంపిస్తున్నట్లుగా ఉండేది. ఈ రీతిగా చెబుతూ, ఇలాంటి సాధనలు తాటాకు పాకల్లో చేయాలిగాని, కాంక్రీటు ఇళ్ళల్లో చెయ్యకూడదన్నాడు. అందువలననేమో పూర్వం తపస్సు అంత:పురాలలో కాక అరణ్యాలలో, పర్ణశాలలో చేస్తూండేవారు.

ఈ స్థితి ఇట్లా ఉంటే, దీనికి భిన్నమైన మరొక స్థితి రాధాకృష్ణగారిలో ఉండేది. అది రాజకీయాలలో చేరి యం.పి. కావాలనుకోవడం. "రెడ్డిగారూ ! భగవంతుడు కమ్మని గాత్రం ఇచ్చాడు. అమ్మ పై అచంచలమైన భక్తి ఉంది. స్థిరంగా అమ్మ సేవలో ఉండక ఈ జంఝూటం దేనికి " అన్నాను.

"ఉండాలయ్యా. రాజకీయాలలో యం.పి నై అంధులకు సేవ చేయాలి" అనేవారు.

యం.పి. కాలేదు. సేవా చేయలేదు. నాణేనికి బొమ్మా, బొరుసు ఉన్నట్లు రెడ్డిగారిలో ఆధ్యాత్మికతతో పాటు లౌకికత రెండునూ నిండియుండేవి.

మరొక విచిత్రము భోజన వ్యక్తిత్వము. అన్నపూర్ణాలయంలో భోజనానికి వచ్చినప్పుడు మూడు విస్తర్లు వెడల్పుగా పరచి, మధ్యలో మంచి విస్తరి వేసి, కూర, పప్పు, సాంబారు,పచ్చడి, మజ్జిగ ఇవన్నీ ఒక్కొక్కటి ఒక్కొక్క వద్దన పళ్ళెం నిండా కలిపి పెట్టే అదృష్టం నాకు కలిగింది. ఆ సమయంలో తాను నామం చేస్తూ, అందరితో నామం చేయించేవాడు.

ఒకసారి మార్వాడీలతో కలసి విహారయాత్రకు వెళ్ళి, అక్కడ ఉన్న 220 మిరపకాయ బజ్జీలు తిన్నందువల్ల అనారోగ్యము చేసి తిండి పుష్టి తగ్గిపోయింది. ఇది నేను విన్న విషయము.

జిల్లెళ్ళమూడి అమ్మ భక్తులలో చాలామందికి రెడ్డిగారి యందు గురుభావం ఉండేది. ఆయనను ఇంటిలో ఉంచుకోవడం చాలా పవిత్ర కార్యంగా భావించేవారు. అయితే ఎక్కువకాలం ఎవరి ఇండ్లలోనూ ఉండక సంచారము చేస్తూండేవారు. చివరిరోజులలో బాపట్ల డాక్టర్ ఇనజకుమారి గారి హాస్పిటల్‌లో తుదిశ్వాస విడిచారు. ఆయనకు బంధువులున్నా జీవితకాలం అంతా జిల్లెళ్ళమూడిలో ఆధ్యాత్మిక బంధువులతోనే గడచింది.

జిల్లెళ్ళమూడిలో శ్రీ వల్లూరి పాండురంగారావుగారి పర్యవేక్షణలో అమ్మ నామం జరుగుతుండగా, రంగారావుగారు అమ్మ అభిషేకాల నిమిత్తం తెచ్చి, అమ్మను అభిషేకించగా మిగిలిన నదీ జలాలలో రెడ్డిగారి పార్థివ దేహాన్ని పవిత్రం చేసి భూస్థాపితం చేసి, దానిపై చక్కని బృందావనం నిర్మించారు. అటువంటి నాదయోగికి ధన్యజీవికి, మాతృశ్రీ అనుంగు బిడ్డ శ్రీ బులుసు ఎల్. సత్యనారాయణ శాస్త్రి గారు "పదార్చన" అంకితం చేయడం వారికి రెడ్డి గారిపై ఉన్న స్నేహానికి, ప్రేమకు గుర్తు. కీ.శే. కాసు రాధాకృష్ణరెడ్డి గారిని "రాధన్నయ్యా" అని గాక "రెడ్డి గారూ" అని పిలవడం నాకు అలవాటు. అంధులైన మన రెడ్డిగారు కృతి భర్త అవుతున్నారని విని పై వాక్యాలు వ్రాస్తానని అడిగి అత్యంత ఆనందంతో ఆ వ్యక్తి విచిత్ర వ్యక్తిత్వాన్ని నాకు తెలిసినంతవరకూ అందరికి తెలియజేస్తున్నాను.

ఇతిశమ్

స్పందన

మొసలికంటి ఎస్. శరత్‌చంద్రకుమార్.

జిల్లేళ్ళమూడి అమ్మ వారి భక్తులు, ప్రియతమ సోదరులు, శ్రీ బులుసు లక్ష్మీప్రసన్న సత్యనారాయణశాస్త్రి గారి "పదార్చన" సంగీతజ్ఞునిగా నాలో కలిగించిన స్పందన.

- లలిత శాస్త్రీయ సంగీతానికి అనువైన సాహిత్యం.
- త్యాగయ్య కీర్తనలు, రామదాసుకీర్తనలు, పోతనపద్యాలు మనసంతా నింపుకుని, పోతనగారిలా పద్యాలు, త్యాగయ్య గారిలా కీర్తనలు వ్రాయాలని ఆధ్యాత్మిక దృష్టితో పరబ్రహ్మతత్త్వాన్ని నెమరువేసుకున్న రచన.
- 'వాగధీశ్వరి', 'మనోహరి' వంటి రాగాలు చెవిలో గింగురుమంటూ ఉంటే, త్రిశ్ర, చతురశ్ర మిశ్ర, ఖండగతులు హృదిలో తాండవం చేస్తూంటే, రాగ, తాళ, భావాలను సమ్మేళనం చేసుకుంటూ సాగించిన రచన.
- భాషాప్రావీణ్యం, సంగీతంపై మక్కువ, చెప్పుకోదగ్గ వినికిడి జ్ఞానం ఉన్నప్పటికీ, "ఏమి తెలియదు, తెలుసుకోవాలి" అనే నమ్రత, రచనలు శాస్త్రీయ సంగీతానికి దగ్గరలో ఉండాలనే దీక్షతో సాగించిన రచన.
- జిల్లేళ్ళమూడి అమ్మ వారి సంస్థ సేవలో నిర్విరామంగా కృషి చేసే శ్రీ సత్యనారాయణ శాస్త్రి అన్నయ్యగారు, అభిమానపూర్వకంగా, అమ్మ భక్తుడు, సంగీత విద్వాంసుడు, శ్రీ కాసు రాధాకృష్ణరెడ్డి (రాధన్నయ్య) గారికి అంకితం ఇవ్వడం వారికి సంగీతం పట్ల సంగీతజ్ఞుల పట్ల, జిల్లేళ్ళమూడి అమ్మవారి అనుంగు బిడ్డలపట్ల గల ప్రేమాభిమానాలను సూచిస్తాయి.
- "ఇంత తెలిసి నేనెంతో మురిసితిని" అని రచయిత జిల్లేళ్ళమూడి అమ్మవారికి "పదార్చన" లోని కీర్తనను తన గళంలో వినిపించి ఆశీస్సులు పొందారు. నాద వినోదిని అమ్మ కరుణతో రచయిత సంగీత-సాహిత్య పిపాస అనర్గళంగా సాగాలని కోరుతూ.....

శరత్

12-06-2002.

గణేశస్తుతి

హంసధ్వని రాగం - ఆది తాళం

సర్వారంభములకు ముందు
హేరంబుని కొలచిన,
ఉర్విని జనులెల్ల
సర్వశుభములు బడయగ;

సిద్ధి బుద్ధి ప్రదాతను
సిద్ధ సంఘ సంపూజ్యుని,
విఘ్నహరుని మదిని, ని
ర్విఘ్నతకై, కైమోడ్చి; ॥ సర్వారంభము॥

అలనాడు పాల్కడలి తరచువేళ
తొలిపూజ పొందు ఈ వేల్పుల పెద్దకు,
సురాసురులు మ్రొక్కులిడగ
అమృత సిద్ధి లక్ష్మీప్రసన్నత కలిగె కదా;

సర్వారంభములకు ముందు
హేరంబుని కొలచిన,
ఉర్విని జనులెల్ల
సర్వశుభములు బడయగ;

2. అరుణాచల రమణ నవరత్నమాల

నవరాగమాలిక

అరుణాచల రమణా, శ్రీ రమణ
అరుణాచల రమణా;

1. అరుణాచల శిఖర తేజ: సంజనిత, శ్రీ రమణ
అరుణాచల రమణా, శ్రీ రమణ
అరుణాచల రమణా;

2. కార్తికేయాంశధరా, శ్రీ వపుషధరా, శ్రీ రమణ
అరుణాచల రమణా, శ్రీ రమణ
అరుణాచల రమణా;

3. చిత్తవృత్తి సంశోధిత ఋషివర, శ్రీ రమణ
అరుణాచల రమణా, శ్రీ రమణ
అరుణాచల రమణా;

4. మూలవృత్తి హృది సంస్థిత నిపుణా, శ్రీ రమణ
అరుణాచల రమణా, శ్రీ రమణ
అరుణాచల రమణా;

5. సర్వరేణు మల పంకిల జగత్యక్ష్య, శ్రీ రమణ
అరుణాచల రమణా, శ్రీ రమణ
అరుణాచల రమణా;

6. ఆనందామృతైక రస సుమనా, శ్రీ రమణ
అరుణాచల రమణా, శ్రీ రమణ
అరుణాచల రమణా;

7. కావ్య కంఠముని సంపూజిత చరణా, శ్రీ రమణ
అరుణాచల రమణా, శ్రీ రమణ
అరుణాచల రమణా;

8. కరుణాంత రంగ పాలిత భువనా, శ్రీ రమణ
అరుణాచల రమణా, శ్రీ రమణ
అరుణాచల రమణా;

9. నూత్న కాల విరచిత తత్త్వ శాస్త్ర సుధీ, శ్రీ రమణ
అరుణాచల రమణా, శ్రీ రమణ
అరుణాచల రమణా;
అరుణాచల రమణా, శ్రీ రమణ
అరుణాచల రమణా;

3. పావనము పావనము

హిందోళ రాగము - ఖండచాపు తాళం

పావనము పావనము పరమ పావనము
తవచరిత మీపుడమి పరమ పావనము;

1. అద్వైత సామ్రాజ్య పట్టాభిషిక్తా
శుద్ధాంత సిద్ధాంత రాద్ధాంత ముక్తా ; ॥పావనము॥
2. సన్యాస ధర్మంబు దేహయాత్రకును,
అన్యమొల్లని నడక దేశయాత్రకును ; ॥పావనము॥
3. వేద సంరక్షణే నీ ధ్యేయమై నిలచె
వాద మెరుగని నీదు ఆచరణ మెలిగె ; ॥పావనము॥
4. గుప్పిట నిండేటి పేలాలభిక్ష,
తప్పులొప్పిన మాకు శ్రీ రామ రక్ష ; ॥పావనము॥

పావనము పావనము పరమ పావనము
తవచరిత మీ పుడమి పరమ పావనము.

కంచి కామకోటి పీఠ జగద్గురువులు శ్రీశ్రీశ్రీ చంద్రశేఖరేంద్ర సరస్వతి మహాస్వామి వారి ప్రస్తుతి.

4. యతిరాయ

కళ్యాణి రాగము - ఖండచాపు తాళం

యతిరాయ యతిరాయ యతిరాయ రాయ
యతిరాయ యతిరాయ యతిరాయ రాయ ;

1. ఏ పూర్వ పుణ్యమో ఏమి చేసితిమో
అపురూపమై నీకు అనుజన్ములైనాము ; ॥యతిరాయ॥
2. తత్త్వ చింతన మాకు బోధించిమించి
వేత్తయై మా మధ్య నిలచినావీవు ; ॥యతిరాయ॥
3. కర్మచితములగు ఈ లోకాలయొక్క
మర్మమరసితివీవు బ్రహ్మ నిష్ఠుడవు ; ॥యతిరాయ॥
4. పరమ పురుషుడవీవు పరమాత్మవీవు
పరతత్త్వ భిక్షచే మమ్ము శిక్షించు ; ॥యతిరాయ॥

కంచి కామకోటి పీఠ జగద్గురువులు శ్రీశ్రీశ్రీ చంద్రశేఖరేంద్ర సరస్వతి మహాస్వామి వారి సంస్మరణ.

5. క్రీస్తుస్తుతి

సింధు భైరవి - చాపు తాళం

శిలువ నెక్కిన ప్రభుని కథను
భక్తితో స్మరియింపుడీ,
సర్వమానవ కోటికెల్లను
శాంతి సుఖముల నిచ్చెడీ ;

ఆర్తులను రక్షింప దేవుడు
భువికి పంపెను పుత్రుని,
ఈశ తనయుడు పుట్టె శుభముగ
మేరికన్యకు మేదిని ; ॥శిలువ॥

ప్రభుని కృపచే భువిని నిండెను
ప్రేమతత్త్వము ఎల్లెడ,
దేవదేవుని దివ్య చరితము
దిక్కులన్నిట నిండగ ; ॥శిలువ ॥

శిలువనెక్కిన ప్రభుని కథను
భక్తితో స్మరియింపుడీ,
సర్వమానవ కోటి కెల్లను
శాంతి సుఖముల నిచ్చెడీ ;

6. యహోవాస్తుతి

రేవతి రాగం – త్రిపుట తాళం

నాదు మో జేసు గాంచిన యహోవా.
నేడు మన హృత్పద్మముల నిండును,
శుభము శుభము శుభము
శుభము శుభము శుభము

దివ్య ప్రభలతో దేవదేవుడు
గోచరించెను మహిమతో,
వెలుగులకు వెలుగైన దేవుడు
తత్పదము తానని చెప్పెను; ॥ నాదు ॥

కొండకొన పొదరింటమండిన
వింత వెలుగుందీ ఎద,
లో చూపునకు చూపగుచు
వెలిగే సత్తుచిత్తును కాంచుడీ ; ॥ నాదు ॥

నాదు మోజేసు గాంచిన యహోవా
నేడు మన హృత్పద్మముల నిండును,
శుభము శుభము శుభము
శుభము శుభము శుభము

7. శివస్తుతి

రాగమాలిక

స్వశ్వశుర యజ్ఞ విధ్వంసక ప్రళయ మూర్తే
సతీవియోగ తాపజనిత విరాగమూర్తే ।
కందర్ప దర్ప జిత హరహర క్రోధమూర్తే
శ్రీ పార్వతీ హృదయ సుందర శంకరోతు ॥

అభవ భయహర అభయమూర్తే
స్వశక్తి సంజనిత విభవమూర్తే ।
ఉమా వామాంక స్థిత ఉభయమూర్తే
శ్రీ పార్వతీ హృదయ సుందర శంకరోతు ॥

సదాః మనస్క యోగస్థ పుణ్యమూర్తే
పరమయోగి హృత్సంస్థిత శాంతమూర్తే ।
పరాదివాక్ శబ్ద ప్రభవ స్ఫోటమూర్తే
శ్రీ పార్వతీ హృదయ సుందర శంకరోతు ॥

ప్రదోషకాల తాండవ ఖేలనలోల నటరాజమూర్తే
శివాంతరంగ సముల్లాస్య విలోకిత పరితృప్తమూర్తే ।
బ్రహ్మాండ భాండ రచనా సామర్థ్యయుత అష్టమూర్తే
శ్రీ పార్వతీ హృదయ సుందర శంకరోతు ॥

అద్వైతానంద బోధ స్వరూప దక్షిణామూర్తే
అణిమాది అష్ట సిద్ధి సుసిద్ధ భవ్యమూర్తే ।
ఉత్తరాధిపతి చారువాస స్థాన స్నేహమూర్తే
శ్రీ పార్వతీ హృదయ సుందర శంకరోతు ॥

8. ఎంతమంచివాడవయ్యా ! శివ !

రాగమాలిక

ఎంత మంచివాడవయ్యా ! శివ !
నీ వెంత మంచివాడవయ్యా ! శివ !
సుంతైనా విసుగురాదా ! లేదా !
నీ వెంత మంచివాడవయ్యా ! శివ !

1. అంతరంగ మశుద్ధంబు
తరగని కాటుక కొండలు,
నిర్మాల్యం విసృజ్యయని
నీకు శుద్ధి సమకట్టగ ; ॥ సుంతైనా ॥

ఓం భూ: ఓం భువ: ఓం సువ:
ఉత్తరత చండీశ్వరాయనమ:
శిరసి నిర్మాల్యం విసృజ్య.

2. హే ! సుగంధాలు వెదజల్లే పుష్పీ ।
ఊదొత్తులు రెండుకాల్చి,
చేతులు అటునిటుత్రిప్పి
సువాసనలు ఇవేనంటే ; ॥ సుంతైనా ॥

ఓంత్రయంబకం యజామహే
సుగంధిం పుష్టి వర్ధనమ్ ,
ఉర్వారుక మివ బంధనాన్
మృత్యోర్ముక్షీయమామృతాత్ ॥

3. నీ నెత్తిన ఇన్నినీళ్ళుపోసి
ఆనక రెండు పూలు పెట్టి
అవీ, ఇవీ ఇమ్మంటూ
దేబిరించే మమ్ము చూసి ; ॥ సుంతైనా ॥

సద్యోజాతం ప్రపద్యామి	ఆవాహనం సమర్పయామి !
సద్యోజాతాయవై నమోనమ:	ఆసనం సమర్పయామి
భవేభవే నాఽతి	పాద్యం సమర్పయామి
అతిభవే భవస్వమాం	అర్ఘ్యం సమర్పయామి
భవోద్భవాయనమ:	ఆచమనీయం సమర్పయామి
వామదేవాయనమ:	స్నానం సమర్పయామి

అష్టమూర్తిని నమక చమక పన్నాలతో అభిషేకించి

సద్యోజాతం ప్రపద్యామి	ఆవాహనం సమర్పయామి !
జ్యేష్ఠాయనమ:	వస్త్రయుగ్మం సమర్పయామి
శ్రేష్ఠాయనమ:	యజ్ఞోపవీతం సమర్పయామి
రుద్రాయనమ:	ఆభరణం సమర్పయామి
కాలాయనమ:	గంధం సమర్పయామి
కలవి కరణాయనమ:	శ్వేతాక్షతాన్ సమర్పయామి
బలవి కరణాయనమ:	బిల్వదళం సమర్పయామి
బలప్రమథనాయనమ:	నైవేద్యం సమర్పయామి
మనోన్మనాయనమ:	తాంబూలం సమర్పయామి

4. ప్రళయంలో సర్వహరా !
ప్రళయంలో సర్వహరా !
ప్రళయంలో సర్వహరా !
కర్పూరం బిళ్ళముక్క చేసి
నీకు వెలుగుచూపు వెర్రితనం
నిండిన హృదయాలనుండే ॥ ఎంతమంచి ॥
అఘోరేభ్యో ఽ థఘోరేభ్యో ఘోర ఘోరతరేభ్య: ।
సర్వేభ్యోస్సర్వశర్వేభ్యో నమస్తేఅస్తు రుద్రరూపేభ్య: ॥

5. గాలివీచు నీభయాన
గాలియాడు నీనయాన
అయినా సరే వింజామర
నీ ఉక్క తీర్చుననగ ; ॥ సుంతైనా ॥

భీషాస్మాద్వాత:పవతే
భీషోదేతిసూర్య: ।
భీషాస్మాదగ్నిశ్చేంద్రశ్చ
మృత్యుర్ధావత పంచమ ఇతి ॥

6. కట్టబట్ట కూడా లేని
దిశమొల గలవాడవంటూ
ఆకాశమంత జాబితాతో
అర్థార్థులు కొలచి కొలువ ; ॥ సుంతైనా ॥
ఓం ఆత్మన: ! ఆకాశస్సంభూత: !
ఆకాశాద్వాయు: । వాయోరగ్ని: ।
అగ్నేరాప: । అద్భ్య: పృథివీ ।
పృథివ్యాఓషధయ: ।
ఓషధీభ్యోఽన్నమ్ । అన్నాత్ పురుష: ।
సవా ఏష పురుషోన్న రసమయ: ।

ఓం శంచమే మయశ్చమే ప్రియంచమేఽను కామశ్చమే
కామశ్చమే సౌమనసశ్చమే భద్రంచమే శ్రేయశ్చమే
వస్యశ్చమే యశశ్చమే భగశ్చమే ద్రవిణం చమే
యంతాచమే ధర్తాచమే క్షేమశ్చమే
ధృతిశ్చమే విశ్వంచమే మహశ్చమే
సంవిశ్చమే జ్ఞాత్రంచమే సూశ్చమే
ప్రసూశ్చమే అయశ్చమే
ఋతంచమే ఽ మృతంచమే ఽ యక్ష్మంచమే ఽ నామయశ్చమే
జీవాతుశ్చమే దీర్ఘాయుత్వంచమే ఽ నా మిత్రం
చమే ఽ భయం చమే సుగంచమే
శయనంచమే సూషాచమే సుదినంచమే !

7. నీవె దుంగ నీవె దొంగ
నీనె లోన, లోలోన నీవే,
ఏమితెచ్చి, ఏమిఇచ్చి
నిన్ను కొలువగలముస్వామి ; ॥ ఎంతమంచి ॥

నమ:సర్వ: నమ: శర్వ: నమ: శివ: నమ: స్థాణు: ।
నమ: సహమానాయ నివ్యాధిన అవ్యాధినీనాం పతయే
నమోనమ: కకుభాయ నిషంగిణస్తే నానాం పతయేనమ:
నమో నిషంగిణ ఇషుధి మతే తస్కరాణాం పతయేనమ:
నమో వంచతే పరివంచతే స్తాయూనాం పతయేనమ:

8. 'నారుద్రో రుద్రమర్చయేత్' అంటే
   'రుద్రోహం రుద్రోహం రుద్రోహం'
   అని మూడు సార్లు ఉచ్చరించి
   నేనూ రుద్రుణ్ణయ్యానంటే ; ॥ సుంతైనా ॥

యోరుద్రో అగ్నౌయో అప్సు య ఓషధీషు
యోరుద్రో విశ్వాభువనా ఽ ఽ వివేశ
తస్మై రుద్రాయనమో అస్తు !

9. మహాన్యాసం చెప్పుకుని
   తను మన వాక్కులలో
   మలహాని చేసుకొనగ
   అంతశ్శుద్ధి నొసగవయా
   అధికారిని చేయవయా ; ॥ ఎంతమంచి ॥

అచిన్త్యం చాప్రమేయంచ వ్యక్తా వ్యక్త పరంచయత్ ।
సూక్ష్మాత్సూక్ష్మతరం జ్ఞేయం తన్మే మన: శివసంకల్పమస్తు ॥
ప్రయత: ప్రణవోంకారం ప్రణవం పురుషోత్తమమ్ ।
ఓంకారం ప్రణవాత్మానం తన్మే మన: శివసంకల్పమస్తు ॥
యోసౌ సర్వేషు వేదేషు పఠ్యతేహ్యాయమీశ్వర: ।
అకాయో నిర్గుణోహ్యాత్మా తన్మే మన: శివసంకల్పమస్తు ॥
ఋతగ్ం సత్యం పరంబ్రహ్మ పురుషం కృష్ణ పింగలమ్ ।
ఊర్ధ్వరేతం విరూపాక్షం విశ్వరూపాయ వైనమోనమస్తన్మేమన:
శివసంకల్పమస్తు ॥
గన్ధ ద్వారాం దురాధర్షాం నిత్య పుష్టాంకరషిణీమ్ ।
ఈశ్వరీగ్ం సర్వభూతానాం తామి హోప హ్వయే శ్రియమ్ ॥
తన్మే మన: శివసంకల్పమస్తు ॥
నమకం చమకం చైవ పురుష సూక్తం చయద్విదు: ।
మహాదేవంచయత్తుల్యం తన్మే మన: శివసంకల్పమస్తు ॥
య ఇదగ్ం శివసంకల్పం సదాధ్యాయన్తి బ్రాహ్మణా: ।

తేపరం మోక్షం గమిష్యన్తి తన్మే మన: శివసంకల్పమస్తు ॥
ఓం నమో భగవతే రుద్రాయ శివసంకల్పగ్ం హృదయాయనమ: ॥

నమ: సోమాయచ రుద్రాయచ నమస్తామ్రాయచారుణాయచ
నమ: శంగాయచ పశుపతయేచ నమో ఉగ్రాయచ భీమాయచ
నమో అగ్రేవధాయచ దూరేవదాయచ నమో హంత్రేచహనీయసేచ
నమో వృక్షేభ్యో నమస్తారాయ నమశ్శంభవేచమయోభవేచ
నమ: శంకరాయచ మయస్కరాయచనమ: శివాయాచ శివతరాయచ
నమ: స్తీర్థ్యాయచ కూల్యాయచ నమ: పార్యాయచావార్యాయచ
నమ: ప్రతరణాయచోత్తరణాయచ నమ: ఆతార్యాయ చాలాద్యాయచ
నమ: శష్ప్యాయచ ఫేన్యాయచ నమ: సికత్యాయచ ప్రవాహ్యాయచ

10. పసిబుద్ధులు పశుబుద్ధులు
ఏదోలే ఈ లొల్లియని,
మిన్ను కన్ను తెరవలేక
మిన్నకుంటివా ! స్వామి ! ॥ ఎంతమంచి ॥

నమో హిరణ్య బాహవే, సేనాన్యేదిశాంచపతయే
నమోనమో వృక్ష్యేభోహరికేశేభ్యో: పశూనాంపతయే
నమోనమ:
నమో భవాయచ రుద్రాయచ నమ: శర్వాయచ ।
పశుపత్ యేచనమో నీలగ్రీవాయ శితికంఠాయచ ।
నమ: సాహస్రాక్షాయచ ।

11. కష్టపెట్టు మమ్ముకాచి
కరుణను కడతేర్చవయా
ఇష్టమైన మాట ఇదే
అష్టమూర్తివయ్య నీవు ; ॥ ఎంతమంచి ॥

నమస్తే అస్తు భగవన్విశ్వేశ్వరాయ మహాదేవాయ
త్రయంబకాయత్రిపురాంతకాయ త్రికాగ్నికాలాయ
కాలాగ్ని రుద్రాయ నీలకంఠాయ మృత్యుంజయాయ
సర్వేశ్వరాయ సదాశివాయ శ్రీ మన్మహా దేవాయనమ:

హరహరమహాదేవ
హరహరమహాదేవ

9. నీ వెపరముడవయ్య

ధర్మావతి - ఖండచాపు తాళం

నీవెపరముడవయ్య ఓ ! భూతనాథా !
నీవె పరంజ్యోతి నిఖిల సంవేద్య ;

1. అండపిండంబుల మలహానికొఅకు
కొండసంపెంగల పూజచేకొనుచు,
శృంగగిరి క్షేత్రమున రాలిపడ్డట్టి
మ్రగ్గిముగ్గిన పండు నీవయ్య శంభో ; ॥ నీవె ॥

2. ఫాలభాగపు మంటముక్కంటికంట
మింటి కెగయకుండ మూతపెట్టంగ,
గంగనిలచిన జడలు జటలల్లు కొనగ
అభిషిక్త నీవడలు సౌగంధ మొదవు ; ॥ నీవె ॥

3. ధంధంధ ధధధంధ ధంధంధ ధంధం
ధింధింధి ధిధిధింధి ధింధింధి ధింధిం
శబ్దజాలం బంత నీ ముఖమునుండి
అక్షరంబై వెలయు ఆద్యంతరహితా ; ॥ నీవె ॥

4. మాదు దుశ్చరితలే హాలాహలంబు
చిలకంగ చిలకంగ చేకొందు వంట,
నీలకంఠుడవయ్య కరుణాసముద్ర
లాలించు పాలించు లకులీశరాయ ; ॥ నీవె ॥

5. లింగమై జంగమై మేనిమధ్యమున
నీవు నెలకొని యుంట మా పుణ్యవశము,
అనాహతంబైన సర్వకారణము
సనాతనంబైన చిద్రూపమదియె ; ॥ నీవె ॥

6. అంగస్థంభము చేసి యాదికల్పించి
షణ్ముఖుని సృజియించి నాయకునిచేసి,
తారకుని మడియింపకారణంబగుచు
ముల్లోకముల సేమ మరసినావయ్య ; ॥ నీవె ॥

7. హే సర్వ ! హే శర్వ ! హే శివస్థాణో
భూతేశ భూతి ప్రద హే ! భీమకాయ
నిన్నుకొలవగలేక ఈ దిక్కులన్నీ
నీ ఒంటినంటుకుని నిండుకున్నాయి ; ॥ నీవె ॥

8. ప్రదోషసమయాన మాయమ్మఎదుట
కుంచిత పాదాన తాండవింపంగ,
అలసి సొలసిన నీకు ఈ చిత్రరచన
ఇంచుక నచ్చెనా ధన్యులము మేము ; ॥ నీవె ॥

నీవె పరముడవయ్య ఓ ! భూతనాథా !
నీనె పరంజ్యోతి నిఖిలసంవేద్య ;
నీవే పరంజ్యోతి నిఖిలసంవేద్య.

10. అందరూ మహానుభావులే

కానడ రాగము - ఆది తాళం

అందరూ మహానుభావులే
అందమైన ఈ నిలయమున ;

పూలతో పూజించవచ్చు
బ్రహ్మజెముడు గుచ్చవచ్చు
దోపిడీకి దిగవచ్చు
అయిననేమి అందరూ బిడ్డలే ; ॥ అందరూ ॥

కోపగించి కొట్టవచ్చు
తాపము ప్రకటించవచ్చు
కాలువిరచి చూడవచ్చు
అయిననేమి అందరూ బిడ్డలే ; ॥ అందరూ ॥

ఏమియైన నేమి కాని
పొట్ట తడిమిపెట్టునమ్మ,
పిల్లలు కాదా మరి
తెలిసి తెలియని సన్నాసులు ; ॥ అందరూ ॥

అందరూ మహానుభావులే
అందమైన ఈ నిలయమున ;

11. అంతి

ఖమాస్ రాగము - ఆది తాళం

ఆదియునితడే అంతమునితడే
వాదములేని ప్రభువితడే ;

1. ఆదిఅంతముల మధ్యన నెలకొను
అద్భుత చరితల కిరవితడే ; ॥ ఆదియు ॥

2. పారమునితడే అపారమునితడే
పారాపారంబుల పరమితడే ; ॥ ఆదియు ॥

3. మానమునితడే అనుమానమునితడే
కొలతలులేని కొలతితడే ; ॥ ఆదియు ॥

4. ఖండమునితడే అఖండమునితడే
ఖండా ఖండంబుల విభుడితడే ; ॥ ఆదియు ॥

5. వసుధను అర్కపురంబునవెలసిన
అసదృశ చరితల వెలుగితడే ; ॥ ఆదియు ॥

ఆదియునితడే అంతమునితడే
వాదములేని ప్రభువితడే ;

12. అమ్మకు వినతి

భాగేశ్వరి రాగము - ఆది తాళం

ఎన్నటికో నీదయ, హే !
అన్నులమిన్నరో ;

చిత్తము సర్వ దిక్కులు పరికించ
విత్తమే మేటి యర్థమనిపించ,
చిత్తజుని మేనయత్తరో ! నన్ను,
హత్తుకు చెప్పవే ; ॥ ఎన్నటికో ॥

వికలమైన ఈ విశ్వమునందు
సకలమునకు నీవె సాక్షివికావ,
అకలంకచరితుడగు, ఈ,
లక్ష్మీప్రసన్నునిపై ; ॥ ఎన్నటికో ॥

ఎన్నటికో నీదయ, హే !
అన్నులమిన్నరో ;

13. నీవులేని తావులేదు నీరజాక్ష

వకుళాభరణం - ఆదితాళం

నీవులేని తావులేదు నీరజాక్ష
నీవుకానిదేదికాదు నీరజాక్ష

నింగినీరు నిప్పునేల నీరజాక్ష
వంగియున్న ఈ సర్వము నీరజాక్ష ; ॥ నీవు ॥

అంతరంగవైభోగము నీరజాక్ష
రంగులకల యాయెనయ్య నీరజాక్ష ; ॥ నీవు ॥

ఎంతకలో ఎంతకథో నీరజాక్ష
ఎంతకథో అంతవ్యధ నీరజాక్ష ; ॥ నీవు ॥

అంతరంగస్వామివీవు నీరజాక్ష
వింతచేసి చూపినావు నీరజాక్ష ; ॥ నీవు ॥

నీవులేని తావులేదు నీరజాక్ష
నీవుకానిదేదికాదు నీరజాక్ష

14. ఎంతోసరసుడవు రామ !

భైరవిరాగం - రూపకతాళం

ఎంతో సరసుడవు రామ ! నీవు,
వింతగూర్చు నీచరితము నామది ; ॥ ఎంతో ॥

1. చిన్ననాట తాటకిని కోలల గూలనేసినావు,
విన్నవించు ఆముని పలుకుల రాతిని నాతిసేసినావు ; ॥ ఎంతో ॥

2. శివునివిల్లు విరచి సీతను పెండ్లియాడినావు
సవతి తల్లి మాటకై వనముల సంచరించినావు ; ॥ ఎంతో ॥

3. కామియైన యా దనుజవనిత ముకుసెవులు కోయించినావు
భామయైన యా తారను సుగ్రీవుని చెంతపుచ్చినావు ; ॥ ఎంతో ॥

4. అడవులను బడి అవనిజకై అలమటించినావు
విడువబడిన యామెను గొప్పకై పుటము పెట్టినావు ; ॥ ఎంతో ॥

5. నిండుచూలు మాయమ్మను అడవులవిడువబుచ్చినావు
అండచేరి పరబ్రహ్మమనే త్యాగరాజవందిత ; ॥ ఎంతో ॥

ఎంతో సరసుడవు రామ ! నీవు,
వింతగూర్చు నీచరితము నామది ; ॥ ఎంతో ॥

15. చాలా సౌఖ్యమురా ! రామ !

ఆనందభైరవి - ఆదితాళం

చాలా సౌఖ్యమురా ! రామ !
చాలా సౌఖ్యమురా ! రామ !

కర్మలనొనరించి కడుసుఖముబడయక
మర్మము నెఱిగి తామదినిలయించుటే ; ॥ చాలా ॥

కాయిక వాచిక మనసిజ విధులందు
మాయిక మోహ తాపమెరుంగమే ; ॥ చాలా ॥

కడుదుర్లభమగు ఈ జన్మమునందే
కడతేరగవలె ననుకొనుటయే ; ॥ చాలా ॥

చింతలులేని చిత్తమేయంతా
* కంతనుబడి శ్రీ త్యాగ రాజవిభు నెఱుంగుటే ; ॥ చాలా ॥

చాలా సౌఖ్యమురా ! రామ !
చాలా సౌఖ్యమురా ! రామ !

* దహరగుహ

16. పత్రశాయినమ్

బేహగ్‌రాగం - ఆదితాళం

పత్రశాయినం పరమేశ్వరమ్ ।
హృదిభావయామి సతతంహరిమ్ ॥

సకల చేతనాచేతన ప్రళయసాక్షిణమ్ ।
అద్భుతవపుషం ఆనందకందమ్ ॥ । పత్రశాయినమ్ ।

వైవస్వతమన్వంతర సంచలిత
కలిసంభూత గోదానందమ్ ।

లక్ష్మీప్రసన్న సంపూజిత లక్ష్మీశమ్
అతిసుందర తరచరితమ్ ॥ । పత్రశాయినమ్ ।

పత్రశాయినం పరమేశ్వరమ్
హృదిభావయామి సతతంహరిమ్

17. ఏమిచేతువో రామ !

శివరంజనిరాగం - ఆదితాళం

ఏమిచేతువో రామ !
నన్నేమి చేతువో !

కామమునే నమ్మినేను
పలుదురితముల నొనరించితి,
తామసమున పరులచేరి
పరిహసింప బడితినయ్య ; ॥ ఏమి చేతువో ॥

కామజనక నిన్నేకడకు
కొలచి కొలతునయ్యనేను,
సేమ మీయవయ్య,
శుభత్యాగరాజవరద ; ॥ ఏమి చేతువో ॥

18. విధివదన

తిల్లంగ్‌రాగం - ఆదితాళం

విధివదన జనిత సకల శబ్దజాలము
అర్థమునే విశదపరచ సర్వసమర్థము ;

అరూప ఽ గుణ ఽ వికార పరంధామ! నీ
నిరూపమైన రూపు వర్ణించవెనుకాడు ; ॥ విధి వదన ॥

భావనాతీత భవబంధ విమోచన
భవభావ భావ భావిత భావేశ ; ॥ విధి వదన ॥

అక్షి దర్శన జన్య జ్ఞానమేపాటిదో
సాక్షిచైతన్య స్వరూప సిద్ధియందు,
సాక్షాత్కార సిద్ధ స్వారాజ్యసిద్ధిచే
మోక్ష సామ్రాజ్య వైభవ లక్ష్మీప్రసన్న ; ॥ విధి వదన ॥

విధివదన జనిత సకల శబ్దజాలము
అర్థమునే విశదపరచ సర్వసమర్థము ;

19. మేలుకొనవే

చక్రవాక రాగం - చాపు తాళం

మేలుకొనవే జీవహంస
మేలుకొనవే పరమహంస
మేలుకొని మేనెల్ల నిండిన
ఏలుబడి కనవే, మేలుకొనవే ; ॥ మేలుకొనవే ॥

అది ఇదాయెను, ఇదిఅదేను
మదిని చూడుము మదము వీడుము,
అదనుగానున్నట్టి, నీ
ఎదనునిండినదే ; ॥ మేలుకొనవే ॥

పంచభూతములే సృష్టి
మంచిరూపము నొందియున్నవి,
మించియున్న పరమసత్యము
మూలమగుటెల్ల ; ॥ మేలుకొనవే ॥

పదము అర్థముగానున్న
పరమ అర్థము పదార్థము,
చూపులోపము రూపుమోసము
మాపురేపుల కాలగతియెల్ల ; ॥ మేలుకొనవే ॥

మేలుకొనవే జీవహంస
మేలుకొనవే పరమహంస
మేలుకొని మేనెల్ల నిండిన
ఏలుబడి కనవే ;

మమ్మేలుకొనవే

20. కప్పబెకబెక

శ్రీరంజని రాగం - చాపు తాళం

కప్పబెకబెక
వినుమురా ! మరి
కప్పచోద్యము
కనుమురా !

కప్పగంతుల
ఎఱుకలేకను,
ముప్పుతిప్పలు
పడకురా ! ॥ కప్పబెకబెక ॥

లోనివెలుగట
బయటివెలుగట
ఆనవాలుగ
తెలియరా !

నిదురనుండి
గెంటిపంపెడి
వదరబోతును
కాంచరా ! ॥ కప్పబెకబెక ॥

వెలికివచ్చిన
వెలుగురేఖే
అలికిడయ్యెడి
జగతిరా !

వారినుండి
గట్టుమీదకు
కప్పవలె
గెంతేయరా ! ॥ కప్పబెకబెక ॥

21. భల్ తమాషాగాడే

సింధుభైరవి రాగం

భల్ తమాషగాడే తారకబ్రహ్మము
తానే జీవుండాయెగదా,
జీవుడుతానై దేవుడుతానై
జగన్నాటకము సలిపెగదా ; ॥ భల్ ॥

అండ పిండ బ్రహ్మాండము లోపల
అఖండ తేజమై వెలిగెకదా,
అండము తానై పిండము తానై
ఇంతనాటకము సలిపె గదా ; ॥ భల్ ॥

చూపూ చిత్తము రూపూ చిత్తము
కల ఎల్లా చిత్రంబుగదా,
చిత్తము తానై చిత్రము తానై
కుసింత నాటకము సలిపెగదా ; ॥ భల్ ॥

మదిలో మర్మము గదిలో మర్మము
సురతంబే మర్మంబుకదా,
మదియూ తానై గదియు తానై
వింతనాటకము సలిపె గదా ; ॥ భల్ ॥

దేశము కాలము వస్తువులన్నీ
జగద్భ్రాంతి యనిపించు గదా,
దేశము తానగు కాలము తానగు
భ్రమకూడా బ్రహ్మంబుకదా ; ॥ భల్ ॥

అండ పిండ బ్రహ్మాండములోపల
అఖండతేజమై వెలిగెగదా,
అండముతానై పిండము తానై
ఇంతనాటకము సలిపె గదా ; ॥ భల్ ॥

భల్ తమాషగాడే తారకబ్రహ్మము
తానే జీవుండాయె గదా,
జీవుడుతానై దేవుడుతానై
జగన్నాటకము సలిపెగదా ; ॥ భల్ ॥

భల్ తమాషగాడే తారకబ్రహ్మము
భల్ తమాషగాడే
భల్ తమాషగాడే

22. మనసా ! ఈ మాయ !

భూపాళ రాగం - చాపు తాళం

ఎల్లమాయలకెల్ల
మనసా ! ఈ మాయ
ఎల్ల మాయల కెల్ల మనసా !

ఉల్లమున నీవుండ
తల్లడిల్లగనేల
మనసా ! ఈ మాయ
ఎల్లమాయలకెల్ల మనసా !

చల్లచల్లగ నీకు
సర్వమును విదితమౌ,
మనసా ! ఈ మాయ
ఎల్లమాయలకెల్ల మనసా !

తనువు నాదనియేవు
తలపు నాదనియేవు
మనసా ! ఈ మాయ
ఎల్లమాయలకెల్ల మనసా !

తనను తానెఱుగకే
తనువు తాననుటయే
మనసా ! ఈ మాయ !
ఎల్లమాయలకెల్ల మనసా !

తనువు తాననుటచే
తనవారు పెరవారు
మనసా ! ఈ మాయ !
ఎల్లమాయలకెల్ల మనసా !

తనకు తెలియకనే
తగులాటములు పెరుగు
మనసా ! ఈ మాయ !
ఎల్లమాయలకెల్ల మనసా !

వాళ్ళు వీళ్ళనుచు నీ
చిత్తమున చింతలే
మనసా ! ఈ మాయ !
ఎల్లమాయలకెల్ల మనసా !

తాళ్ళూ పేళ్ళూ సదా
తలపు లల్లలాట
మనసా ! ఈ మాయ !
ఎల్లమాయలకెల్ల మనసా !

కాయమున కంతలకు
వింత వింతలు చూపు
మనసా ! ఈ మాయ !
ఎల్లమాయలకెల్ల మనసా !

మేను నేనై యుండ
నీవు నేనని యేటిమాటే
మనసా ! ఈ మాయ !
ఎల్లమాయలకెల్ల మనసా !

నేను నేనై యుండ
మాయమయ్యే మాయ
మనసా ! ఈ మాయ !
ఎల్లమాయలకెల్ల మనసా !

ఎల్లమాయలకెల్ల
మనసా ! ఈ మాయ
ఎల్ల మాయల కెల్ల మనసా !

23. అందునీవే ఇందునీవే

సూర్య రాగము - త్రిపుటతాళము

అందునీవే ఇందునీవే
ఎందు ఎందు వెదకినా ;

పంచపంచ తత్త్వమైనా
పంచత్వము నొందేదైనా ; ॥ అందునీవే ॥

అణువులమరి యున్నవన్నా
కణములతో గొలుసులన్నా,
మణిమంత్రపు సిద్ధులన్నా
వేణుగాన లహరియన్నా ; ॥ అందునీవే ॥

కర్కశంపు చర్చలైనా
తర్కశాస్త్రపు చిక్కులైనా,
అర్కసోముల చలనమైనా
మర్కటంబుల గెంతులైనా ; ॥ అందునీవే ॥

హృదయగుహలో చీకటున్నా
గ్రంధి భేదన జరగకున్నా,
ఎదవిచ్చిన సొబగులన్నీ
విదితములే నీదు కృపను ; ॥ అందునీవే ॥

ది. 4-11-2002 తేదీన, అనగా చిత్రభానునామ సంవత్సర ఆశ్వయుజ బహుళ అమావాస్య దీపావళి పర్వదినం రోజున, కాశీ పట్టణంలో బంగారు అన్నపూర్ణ, విశాలాక్షి సమేత శ్రీ విశ్వేశ్వరుని దర్శించుకుని, ది. 5-11-2002 తేదీన అసి, కేదార్, దశాశ్వమేధ్, పంచగంగ, మణికర్ణిక ఘట్టాలలో ప్రవహించే గంగలో పంచతీర్థ స్నానం చేసి పునీతులమై, ది. 6-11-2002 తేదీ నుండి ప్రతిదినం శ్రీ తారకేశ్వరుని గుడిలో మహన్యాసపూర్వక ఏకవార రుద్రాభిషేకం చేసుకుంటున్న సందర్భంలో, ప్రతిరోజు ఎదురుగుండా సుమారు నాలుగు వందల సంవత్సరాల క్రితం ఔరంగజేబు

మతదౌష్ట్యానికి ఆహుతి అయిన విశ్వనాథుని మందిరం, ఆ మందిరం స్థానంలో వెలసిన మశీదు, ఆ మశీదు గోడలమీద కోతులు గెంతులు వేస్తూండడం గమనించే నాకు, ది. 11-11-2002 తేదీన ఉదయం గంగాతీరంలో నా విడిదిలోనుండి, గంగకావల తూర్పుతీరం మీదుగా పైకి వచ్చే ఆదిత్యబింబాన్ని తిలకిస్తోంటే మనస్సు పరవశించి, వళ్ళు పులకరించిన వేళ వెలువడిన కీర్తన ఇది.

భగవంతుని గురించి ఏమి తెలియని మనం, భగవంతుని పేరుతో చేసిన, చేస్తోన్న అరాచకకాండ, మనలో మనకు మన స్వరూప దర్శనం కానివాడు ఆ మశీదు గోడల మీది మర్కట చేష్టలేననిపించింది. ఏ శాస్త్రము, ఏ వాదము భగవంతుని మనకు అందివ్వలేవు, అది జరిగిననాడు ఏ శాస్త్రము, ఏ వాదముతోనూ ఇక పనిలేదు. అలా కాని నాడు భగవంతుని పేరుతో కొట్టుకోవడం ఉత్త, చెత్త స్వార్థం. ఇంకేమి కాదు.

భూమిమీద విశ్వనాథుని మందిరాన్ని కూల్చగలిగేరు గాని, విశ్వనాథుని మందిరమైన ఈ యావద్విశ్వాన్ని ఎవరేమి చెయ్యగలరు. ఇంతేకాదు అణువణువు విశ్వనాథుని మందిరమే. వాటిని బ్రద్దలుకొడితే ఏంజరుగుతుందో ఇప్పుడు అందరికీ తెలుసు.

అణోరణీయాన్మహతో మహీయాన్
ఆత్మాఽస్య జంతోర్నిహితో గుహాయామ్ ।
తమక్రతు: పశ్యతి వీతశోకో
ధాతు: ప్రసాదాత్ మహిమానమాత్మన:
(కఠోపనిషత్తు 1-ii-20)

24. పరమానంద సాగరమున

కాపీ రాగం - ఆది తాళం

పరమానంద సాగరమున
పరవశించవే ! ఓ మనసా !

సరసమైన తనుమధ్యను
అరమరికలు లేకవెల్గు ; ॥ పరమానంద ॥

సత్తైనది చిత్తైనది సకలమునకు తిరమైనది
* అత్తైనది ఒకటైనది రెండైనది భయమైనది
మిత్తైనది మిధ్యైనది పరితాపములకిరవైనది
మత్తైనది మదమైనది మదిని తొలగజేసి సదా ;

పరమానంద సాగరమున
పరవశించవే ! ఓ మనసా !

* అత్తాచరాచర గ్రహణాత్ (బ్రహ్మసూత్రము)



ఈప్సితార్థ ప్రదాయిని హైమక్క

గ్రంథకర్త పరిచయము



శ్రీ బులుసు ఎల్. సత్యనారాయణ శాస్త్రి గారి జననం 1935 తూర్పు గోదావరి జిల్లా లోని రాజోలు గ్రామంలో. బులుసు శేషమ్మ, బులుసు సోమనాథశాస్త్రిగారలు వీరి తల్లిదండ్రులు. వీరిది వేద పండితుల వంశం. వీరి విద్యాభ్యాసం కాకినాడ, బోంబాయి నగరాలలో.

వీరి తండ్రిగారు తెలుగు పండితులు, భాషావేత్తలు. తూర్పు గోదావరి జిల్లాలో రెవిన్యూ శాఖలో ఉద్యోగం చేసి, డిప్యూటి తహశీల్దారు, మెజిస్ట్రేట్‌గా పదవీ విరమణ చేసియుండిరి.

శ్రీ బులుసు ఎల్. సత్యనారాయణ శాస్త్రి గారు తూర్పు గోదావరి జిల్లా కలక్టర్ కార్యాలయంలో అభివృద్ధి, ప్రణాళిక రచన విభాగాలలో పనిచేసి పదవీ విరమణ చేసారు. వీరి వివిధిష, వాసుదేవ మూర్తి నవలలు, తెలుగులోమహావాక్యం, మాండూక్యగీతము, అక్షరంవీథిన పడింది తెలుగులో ప్రచురింపబడ్డాయి. వీరి మాండూక్యోపనిషద్ - ఎస్టడీ, కారొనేషన్ ఆఫ్ దిశాండల్స్ అనే ఆంగ్ల నాటకం భారతీయ విద్యాభవన్ వారు ప్రచురించారు.

శ్రీ బులుసు ఎల్ సత్యనారాయణ శాస్త్రి గారి రచన 'పదార్చన' పదాలతో అర్చన. స్తుతులు, కీర్తనలు, గేయాలు, తత్త్వాలుగా వీరి పదాలు ఈ గ్రంథలో చోటు చేసుకున్నాయి.